
# పేదరాశి పెద్దమ్మ కథలు



# పేదరాశి పెద్దమ్మ కథలు

పూర్వకాలంలో ప్రతి ఊరిలోనూ వయసుమళ్ళిన ఒక ముసలమ్మ బ్రతుకుతెరువుకోసం చిన్నచిన్న పనులు చేసుకుంటూ ఉండేది. వాటిల్లో కొన్ని- పూలు అల్లి అమ్మకం, బాటసారులకు విశ్రాంతి కొరకు అన్నపానాదులు సమకూర్చిపెట్టడం ఇలా పలురకాల పనులు చేసి, ఊరివారు, బాటసారులు ఇచ్చిన కొద్దిమొత్తంతో బ్రతకు వెళ్ళబుచ్చడం చేస్తుంది. వీరి పేదరికాన్ని చూసి వీరికి 'పేదరాశి' అని వయసులో పెద్దది గాబట్టి పెద్దమ్మ అని పిలవడం జరిగేది.

ఈ పేదరాశి పెద్దమ్మలు బాటసారులకు తమ ఊరిగురించి, చుట్టుప్రక్కల ప్రాంతాలలో ఉండే విశేషాలను చెబుతూ ఉండేవారు. మరికొందరు ఊళ్ళో ఉండే పిల్లలను చేరబిలిచి రకరకాల కథలను వారికి చెబుతుండేవారు. ఈ పేదరాశిపెద్దమ్మ చెప్పేకథలు పిల్లలకేగాక పెద్దవారికి గూడా ఎంతో ఉపయోగకరంగా ఉండేవి. ఆమె కథలో ఎంతో నీతికూడా కనిపించేది. పిల్లలు 'పేదరాశి పెద్దమ్మకథలు' అనగానే ఎంతో ఉత్సాహంతో చెవులొగ్గి వింటారు.

పేదరాశిపెద్దమ్మ చెప్పేకథలు గ్రంథస్థం చేయబడినవి కాదు. ఒకరినుండి మరొకరికి మౌఖికంగా చెప్పబడినవే. ప్రతికథలోనూ నీతి ఉంటుంది. కథకూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. అనేకరకాల కథలు అనేకమందిచేత చెప్పబడినవిగదా! అందుచేత ఈ కథలలో కొన్ని కథలు జంతువుల పాత్రలోనూ, మరికొన్ని మనుషులకు సంబంధించినవి ఉంటాయి.

పేదరాశి పెద్దమ్మకథలు కాలక్షేపానికి, వినోదానికి, లోకజ్ఞానానికి, నీతిని పెంపొందించడానికి - ఇలా పలురకాలుగా ఉపయోగపడతాయి. ఇందులో మనకు పేదరాశి పెద్దమ్మ ఒకొక్క కథని చెబుతుంటుంది కాబట్టి పెద్దమ్మ పాత్ర మనకు కనిపించదు. కేవలం కథలు మాత్రమే ఉంటాయి.

- పబ్లిషర్స్

# ఆలోచన లేనిపని కూడదు

భారతదేశంలో గల పురాతన నగరాలలో పురుకుత్సపం అనేది ఒకటుండేది. అందులో మార్తాండుడనే బ్రాహ్మణుడు నివసిస్తూ ఉండేవాడు. అతను దైవభక్తి పరాయణుడు, పాపభీతిగలవాడు, మంచివాడు. అతనికి ఒకే ఒక చింత ఉండేది. అది సంతానలేమి. సంతానంకోసం ఎన్నోపూజలు, వ్రతాలు చేశారు మార్తాండుడు అతని భార్య భోలి.

ఎంతో వేడుకొన్నందుకో లేక అతని పూజ సఫలం అయినందు వల్లనో గాని ఎట్టకేలకు అతనికి ఒక సుపుత్రుడు కలిగాడు. మార్తాండుని ఆనందానికి అంతులేదు. అతని కుమారుని జననవార్త తన ఇరుగుపొరుగు వ్యక్తులతో పొలుపంచుకోవాలని బయలుదేరాడు. అతను ఇంటి తలుపు తీసినంతనే ఆ తలుపుచాటున ఒకపిల్ల ముంగీస అరుస్తూ కనబడింది. మార్తండుడు దానిని తిప్పి పంపేందుకు ప్రయత్నించాడు. కానీ అది ఆ ఇంటిని, అతనిని వదలి వెళ్ళక అక్కడనే తచ్చాడుతున్నది.

మార్తాండుడు ముంగీస పిల్లను దేవుడే తనవద్దకు పంపాడని భావించి దాన్ని తీసుకొని పెంచుకోవడానికే నిశ్చయించుకున్నాడు. మార్తాండుడు తన బిడ్డతో పాటుగానే ముంగీసనుకూడా అల్లారుముద్దుగా పెంచుకోసాగాడు. చుట్టుప్రక్కల వాళ్ళు మార్తాండునితో "ముంగీస నీ రెండోకొడుకా?" అని అడుగుతూ వేలాకోళమాడేవారు.

అలా కొంతకాలం గడిచింది. మార్తాండు, అతని భార్య భోలి, ఇద్దరూ తమకు లేకలేక కలిగిన సంతానానిపై ఈగ కూడా వాలకుండా పెంచుకుంటున్నారు. ఒకనాడు మార్తాండుని భార్య భోలి దగ్గరలో గల నదిలో స్నానానికి వెళ్ళింది. అక్కడే బట్టలుకూడా ఉతుక్కుంటారు. వెళుతూ పిల్లవాడిని




జాగ్రత్తగా చూస్తూ ఉండమని భర్త మార్తాండునికి అప్పగించి వెళ్ళింది. మార్తాండుడు కూడా పిల్లవాని ఉయ్యాలదగ్గరే ఉండి పిల్లవానికి నిద్రాభంగం కాకుండా చూస్తున్నాడు.

అదేసమయంలో ఆ దేశపు మహారాజుగారు అత్యవసర పనిమీద మార్తాండుని రాజసభలో తక్షణం హాజరుకావాలని తన భటులతో కబురుపంపాడు. మార్తాండునికి ఏమిచేయాలో పాలుపోలేదు. ఇంట్లో ఇంకా ఎవరూలేరు. తన భార్య రేవుకు వెళ్ళింది. ఆమె రావడానికి రెండుమూడు గంటలు పడుతుంది. రాజుగారు సభకు తక్షణం రమ్మని కబురుపంపారు. ఆలస్యం చేస్తే రాజుగారు కోపగించుకుని దండిస్తారేమో! రాజుగారు దండన అంటే కఠినంగా ఉంటుంది. ఇలా పరిపరివిధాలుగా ఆలోచించి చివరకు రాజసభకు వెళ్ళడానికే నిర్ణయించుకున్నాడు.

పిల్లవాడికి నిద్రాభంగం కలగకుండా చూసుకోమని తన ముంగీసకు చెప్పి తలుపు దగ్గరగా వేసి రాజుగారి వద్దకు బయలుదేరాడు. పిల్లవాని ఊయల వద్ద గల ఒక ఎత్తైన బల్లపైన ముంగీస కూర్చుని పిల్లవానిని చూస్తూ ఉన్నది. పిల్లవాడు హాయిగా నిద్రపోతున్నాడు.

ఇంతలో ఒక నల్లత్రాచుపాము ఒకటి ఆ యింట్లోకి ప్రవేశించింది. అది అటూ ఇటూ తిరుగుతూ బుసలుకొడుతూ పసిపిల్లవాడు నిద్రిస్తున్న ఊయల దగ్గరకు వచ్చింది. అంతేగాక చకచకా ఊయలపైకి ఎగబ్రాకడం మొదలుపెట్టింది. పిల్లవానిని కంటికి రెప్పలాగా చూస్తున్న ముంగీస కంట్లో అదిపడింది. అంతే ముంగీస ఊరుకుంటుందా? ఒక్కుదుటున దానిపైకి దూకింది. రెండూ క్రిందపడ్డాయి. జాతివైరం కదా! భీకరంగా పోట్లాడుకున్నాయి. ముంగీస ఎట్టకేలకు పాము మెడను ఒడిసిపట్టుకుని కసుక్కున కొరికింది. అంతే గిలగిలా కొట్టుకుంటూ పాము ప్రాణాలు విడిచింది.





ముంగీస కసి తీరలేదు. ఆ పామును ముక్కలుగా చేసింది. గదంతా రక్తసిక్తమైంది. ముంగీస మూతికి, వంటికి రక్తం అంటుకున్నది.

ఈలోగా రాజుగారి వద్దకువెళ్ళిన మార్తాండుడు మళ్ళా యింటికి వచ్చాడు. తలుపు తెరిచాడు. యజమాని వచ్చాడన్న ఆనందంతో ముంగీస అతనికి ఎదురేగింది. రక్తసిక్తమైఉన్న ముంగీస నోటిని చూచి యజమాని నోట మాటరాలేదు. ఆందోళన పెరిగింది. పిల్లవాడిని ఒంటరిగా ఒక మృగానికి అప్పగించి వెళ్ళడం తనదే పొరపాటు లేక లేక కలిగిన పిల్లవాడిని ఈ ముంగీస దారుణంగా చంపి ఉంటుందని భావించి తన ఒరలో కత్తిని తీసి ఒక్కవేటుతో కోపంగా ముంగీసను నరికి చంపాడు మార్తాండుడు. గిల గిల కొట్టుకుని ముంగీస మరణించింది.

ఇంటిలోనికి పోయిచూసిన మార్తాండుడు నిశ్చేష్టుడయ్యాడు. పిల్లవాడు ఊయలలో ఆదమరచి నిద్రపోతున్నాడు. గది అంతా రక్తసిక్తమైంది. నల్లత్రాచు ముక్కలు ముక్కలుగా పడి ఉన్నది. పరిస్థితి అర్థమైన మార్తాండుడు "అయ్యో! నాకు మేలుచేసిన ముంగీసను తొందరపాటుతో పొరపడి చంపేశానే!" అని విచారించాడు. ఈలోగా నదికివెళ్ళిన మార్తాండుని భార్య భోలి కూడా వచ్చింది. భర్తచేసిన పనికి ఎంతగానో విచారించింది.

అందుకనే 'ఆలోచన లేని పనికూడదు' అన్నారు. అని చెప్పింది పేదరాశి పెద్దమ్మ.

# ఆశపోతు మంగలి

ఒకానొకప్పుడు ఒక పట్టణంలో శివశరణుడనే వర్తకుడు నివసిస్తూ ఉండేవాడు. అతను వ్యాపారంలో లాభాపేక్ష కంటే ఇతరులకు సహాయం చేయడంలోనే ఎక్కువశ్రద్ధ కనబరిచేవాడు. మంచివాడు సాధుజనులపట్ల అభిమానంగలవాడు. తన ఇంటికి వచ్చిన అతిథులను ఏనాడూ వట్టి చేతులతో పంపేవాడు కాదు. దానశీలి. అయితే ఇన్ని సద్గుణాలవలన అతని ఆస్తి పాస్తులన్నీ కరిగిపోయాయి. చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అయినప్పటికీ తన పద్ధతులను ఏమాత్రం మార్చుకోలేదు.

ఒకనాడు శివశరణుని ఇంటికి కొందరు సాధువులు వచ్చారు. సుదూరప్రాంతంనుండి వచ్చినవారికి సకల ఉపచారాలు తనశక్తి కొద్దీ చేశాడు శివశరణుడు. ఆ సాధువులలో ఒకాయన అతని పరిస్థితి గ్రహించాడు. వారు అతని ఇంటిని వదిలివెళ్ళిపోయే సమయంలో ఆయన శివశరణుని పిలిచి, "నాయనా! నీ ధర్మబుద్ధి ప్రశంసనీయం. ఒకసారి నువ్వు ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు వచ్చాను. అప్పుడు ఏవిధంగా ప్రవర్తించావో నేడు బీదరికంలో ఉండికూడా నువ్వు అలాగే ప్రవర్తిస్తున్నావు. నువ్వు శివాలయానికి వెళ్ళి శివనామజపం చేయి నీకు శుభం కలుగుతుంది" అని చెప్పి ఆశీర్వదించి వెళ్ళారు వారు.

శివశరణుడికి ఆ సాధువు చెప్పిన మాటలపై గురికుదిరింది. ఆసక్తికూడా కలిగింది. ఒకనాడు ఎవరికీ చెప్పకుండా ఊరివెలుపల ఉన్న శివాలయానికి చేరుకున్నారు. శివాలయం అపరిశుభ్రంగా ఉంది. దానిని శుభ్రంచేసి తానుకూడా శుచియై శివనామస్మరణ చేస్తూ కూర్చున్నాడు. అతను ఆవిధంగా శివస్మరణలో మునిగిపోయాడు. అన్నపానాదులు కూడా తీసుకోలేదు. కనీసం స్నానం కూడా చేయలేదు. భక్తిలో మునిగిపోయాడు. ఆ విధంగా శివశరణుడు



నలభై పగళ్ళు, నలభైరాత్రులు శివనామస్మరణ చేశాడు. నలభైరోజులూ అతనికి ఇల్లుగాని భార్యబిడ్డలుగాని గుర్తుకురాలేదు. అంతగా దీక్ష, భక్తిలో మునిగిపోయాడు.

చివరికి నలభైయవ రోజు శివశరణునికి ఆశ్చర్యం కలిగించేటట్లుగా శివలింగం నుండి కాంతులు వెలువడ్డాయి. పైగా శివలింగంనుండి మాటలుకూడా వినబడ్డాయి. శివశరణుడు చేతులుజోడించి నిలబడ్డాడు.

అప్పుడు శివలింగంలోనుండి "నాయనా! శివశరణుడా! నీ నిశ్చలభక్తికి మెచ్చాను. తరిగిపోయిన నీ సంపదలు తిరిగి లభించే మార్గంచెబుతాను. శ్రద్ధగావిను. - వెళ్ళు - వెళ్ళి నదిలో శుచిగా స్నానంచేయి. అక్కడినుండి తడిబట్టలతోనే ఇంటికి వెళ్ళు ప్రధాన ద్వారంగుండా లోనికి వెళ్ళు. అప్పుడు ఒక బిక్షగాడు నీ ఇంటివాకిట్లోకి వస్తాడు. ఒకపెద్ద దుడ్డుకర్రను తీసుకుని దానితో ఒక్కవేటుతో అతని తల పగలగొట్టు. ఆ తరువాత అతను క్రిందపడి చనిపోతాడు. నువ్వు అతనిని తాకితే అతను బంగారంగా మారతాడు. దానితో నీ దారిద్ర్యం తీరిపోతుంది." అని వినిపించాయి.

శివశరణుడు దైవాజ్ఞప్రకారం శుచియై తడిబట్టలతో ప్రధానవాకిటిలో నుండి లోనికి వెళ్ళాడు. అప్పుడే ఒక భిక్షగాడు శివశరణుని ఇంటికి వచ్చాడు. శివాజ్ఞప్రకారం శివశరణుడు ఒకపెద్ద దుడ్డుకర్రను తీసుకుని ఒకే దెబ్బతో అతని తల పగలగొట్టాడు. పడిపోయిన భిక్షగాని శిరస్సును తాకాడు. ఆశ్చర్యం కలిగించేటట్లుగా అతను బంగారంగా మారిపోయాడు. దానితో శివశరణుని దారిద్ర్యం తీరిపోయింది. యధావిధిగా పుణ్యకార్యాలు చేస్తూ జీవనం గడపసాగాడు.

అయితే సకల సంపదలను పోగొట్టుకున్న శివశరణుడు మళ్ళీ అకస్మాత్తుగా ధనవంతుడైన విషయం ఎవరికీ అంతుచిక్కలేదు. కానీ

శివశరణుని విషయం పూర్తిగా తెలిసినవాడు ఒకడున్నాడు. అతనే మంగలి బుద్ధినాయి. అతను ప్రతిరోజూ శివశరణుని ఇంటికి వచ్చి అతనికి క్షవరంచేసి వెళ్ళేవాడు. ఒకనాడు యధాప్రకారం క్షవరం చేయడానికి వస్తే శివశరణుడు కనిపించలేదు. దానితో అతనికోసం అంతావెతికాడు. ఊరిబయట శివాలయంలో శివశరణుడు శివనామస్మరణ చేస్తూ కనిపించాడు. ఆ తరువాత అతనికోసం బుద్ధినాయి కూడా శివాలయానికి వెళ్తుండేవాడు. కొన్నిరోజులు గడిచాక శివశరణుడు కళ్ళు తెరచి శివాలయం బయటకు వచ్చాడు.

బుద్ధినాయి అతనికి తెలియకుండా అన్నీ చాటుగా గమనిస్తున్నాడు. శివశరణుడు నదిలోస్నానం చేసి తడిబట్టలతో ఇంటికి చేరడం. ఆతరువాత ఇంటికివచ్చిన భిక్షగాడితలపై దుడ్డుకర్రతో మోది తలపగలగొట్టడం అతని తలను తాకడంతో భిక్షగాడు బంగారంగా మారడం, శివశరణుడి దరిద్రంపోయి ధనవంతుడవడం, అన్నీ చాటునుంచి చూసిన బుద్ధినాయికి తనుకూడా గొప్పవాడుగా మారాలని అనిపించింది.

బుద్ధినాయికూడా శివాలయానికి చేరి శివనామస్మరణ చేశాడు. తరువాత నదివద్దకు వెళ్ళి స్నానం చేశాడు. తడిబట్టలతో ఇంటికి చేరాడు. అంతకుముందే ఒక దుడ్డుకర్రను తలుపుచాటుగా సిద్ధంగా ఉంచుకున్నాడు. ఇంతలో ఒక భిక్షగాడు బుద్ధినాయి ఇంటికి వచ్చాడు. బుద్ధినాయి వెనకాముందు చూడక ఒకే ఒక దెబ్బతో భిక్షగాని తల పగలగొట్టాడు. రక్తం వరదలా పారింది. అతని మెదడు బయటపడింది. భిక్షగాడు కుప్పకూలిపోయాడు. బుద్ధినాయి అతని వద్దకుపోయి భిక్షగాని తలను చేతితో తాకాడు. అయినప్పటికీ భిక్షగాడు బంగారంగా మారలేదు.

ఇంతలో ఈ దృశ్యాన్ని దూరంనుండి చూసిన రాజభటులు పరుగుపరుగున అక్కడికి చేరుకున్నారు. చచ్చిపడిన భిక్షగాడిని చూశారు. చేతిలో దుడ్డుకర్రతో నిలబడిన బుద్ధినాయిని చూసి వెంటనే అతనిని



బంధించారు. అతనిని హత్యానేరంపై మహారాజుముందు హాజరుపరిచారు. బుద్ధినాయి తాను కావాలని హత్యచేయలేదని మొరపెట్టుకున్నాడు. పైగా శివశరణుడు కూడా ఇదేవిధంగా చేశాడని అతను ధనవంతుడయ్యాడని చెప్పాడు. మహారాజు అతనిమాటలు నమ్మదగినవి కావనిత్రోసి పుచ్చాడు. బుద్ధినాయికి ఉరిశిక్ష విధించాడు.

పరులు సంపన్నులుగా మారడంచూసి ఆశపడిన ఆశపోతు మంగలికి తగిన శాస్తి జరిగింది కదా! అందుకనే ఇతరుల సంపదపై ఆశ పడకూడదు అని చెప్పింది పేదరాశి పెద్దమ్మ.

## నలుగురు చెప్పేదే నిజం!?

ఉదత్తు అనే గ్రామంలో రాంలాల్ అనే ఒక బ్రాహ్మణుడు నివశించేవాడు. రాంలాల్ చిన్నతనం నుంచి తిండిపుష్టి కలవాడు. పదిమంది తిన్నంత తిని ఊరివారిని ఆశ్చర్యంలో ముంచెత్తేవాడు. రాంలాల్ తండ్రి గోవిందలాల్ రాజుగారి ఆస్థానంలో పనిచేసేవాడు. అక్కడే అతను ఎంతో ధనం సంపాదించాడు. గోవిందలాల్ మరణించాక అతనిసంపద రాంలాల్ పరమైంది. అయితే అదంతా రాంలాల్ తిండికే హారతి కర్పూరంలా కరిగిపోయింది.


తండ్రి జ్ఞాపకంగా ఒక ఆవును మాత్రం పెంచుకుంటున్నాడు. రోజులన్నీ ఒక్కలాగా ఉండవు కదా! కొంతకాలానికి రాంలాల్‌కు వయసుపెరిగింది. జీర్ణశక్తి తగ్గింది. విరేచనాలు, వాంతులు మొదలయ్యాయి. పూర్తిగా జబ్బుపడి నీరసించిపోయాడు. నడిచే ఓపిక లేదు. నీళ్ళవిరోచనాలు కావడంతో మనిషి డీలాపడిపోయాడు. ఊళ్ళోఉన్న వైద్యుణ్ణి పిలిపించాడు. వైద్యుడు అతన్ని పరీక్షచేసి "నువ్వు అతిగా తినడాన్ని ముందు తగ్గించాలి. రోజుకు ఒక కప్పు అన్నం, చారు, ఒక కప్పు మేకపాలు తీసుకుంటే నీ ఆరోగ్యం మెరుగు పడుతుంది" అన్నాడు.

రాంలాల్‌కు తండ్రిద్వారా సంక్రమించిన ఆవు ఉన్నది గాబట్టి ఆవుపాలు త్రాగుతూ అన్నం, చారు తినడం మొదలుపెట్టాడు. అయితే ఫలితం ఏమంత గొప్పగాలేదు. మళ్లీ వైద్యుణ్ణి కొంతకాలం గడిచిన తరువాత కలిసి పరిస్థితి చెప్పుకున్నాడు. వైద్యుడు అతణ్ణి పరీక్షించి “ఏమయ్యా! మేకపాలు త్రాగమంటే ఆవుపాలు త్రాగితే ఎలా కుదురుతుంది? కాబట్టి నేను చెప్పినట్లు తప్పనిసరిగా మేకపాలు త్రాగాల్సిందే” అన్నాడు

రాంలాల్‌కు గొప్ప చిక్కువచ్చిపడింది. దగ్గరలో మేకపాలు అమ్మేవాళ్ళు లేరు. పైగా రాంలాల్‌కు మేకల గురించి తెలీదు. మేకపాలు తాగాల్సిందే నంటున్నాడు వైద్యుడు.సరే ఎలాగైనా ఒక మేకను తీసుకుని పెంచుకుని దాని పాలు త్రాగడమే మేలు! ఖర్చుకూడా తగ్గుతుంది. అని భావించాడు. మేకపాలు బయట కొంటే నెలకు ఎంత ఖర్చు అవుతుంది? వైద్యుడు మూడునెలలు వాడమంటున్నాడు – ఈ లెక్కన బయట పాలుకొనే బదులు ఆ డబ్బుపెడితే ఒక మేక వస్తుందిగదా! ఇలా ఆలోచించి డబ్బు కూడబెట్టుకుని మేకను కొనేందుకు నిశ్చయించుకున్నాడు.

రాంలాల్ ఉన్న ఊరికి దగ్గరలోనే ఉన్న ఒకపల్లెటూరులో సంత జరుగుతుంది. ఆ వారాంతపు సంతకు బయలుదేరాడు రాంలాల్. సంతలో రాంలాల్ మేకలగురించి వాకబుచేసుకునే విధానాన్ని గమనించిన ముగ్గురు వ్యక్తులు అతన్నే అనుసరించసాగారు. రాంలాల్ ఎట్టకేలకు ఒకమేకను తీసుకుని బయలుదేరాడు. ముగ్గురు వ్యక్తులు మోసగాళ్ళు. వారు ఎలాగైనాసరే రాంలాల్ వద్ద ఉన్న మేకను దొంగిలించాలి అనుకున్నారు.

వారు ముగ్గురూ కలిసి ఒక పథకం వేసుకున్నారు. ఒకళ్ళనొకళ్ళు కూడబలుక్కుని ఎవరికి వారు విడిపోయారు. కొంతదూరం వెళ్ళాక ఒకడు రాంలాల్‌కు ఎదురేగి పకపకా నవ్వుతూ “ఏమిటి పంతులుగారు! కుక్కని తీసుకువస్తున్నారు?” అన్నాడు.



రాంలాల్‌కు కోపం వచ్చింది. "ఓరేయ్ మూర్ఖుడా! మేకను పట్టుకుని కుక్క అని అంటావేం? నీకేమైనా మతిపోయిందా?" అన్నాడు.

"కాదండీ! ఇది ముమ్మాటికీ కుక్కే! ఆడకుక్క! దీన్ని ఆ పక్క గ్రామంవాళ్ళు తన్నడం చూశాను. దీని వయసు కూడా పెద్దది చూడండి ఎలా కుంటుతూ నడుస్తుందో!" అన్నాడు.

మేక అటు ఇటు బెదురుచూపులతో నడుస్తుంది. దానినిచూసి రాంలాల్ ఇది కుంటుతూ నడుస్తోంది అనుకున్నాడు. దానిని ఎత్తి భుజంపైన వేసుకుని నడవడం మొదలుపెట్టారు. ఆ మోసగాడు రాంలాల్ దాటుకుని వెళ్ళినట్లే వెళ్ళి అతనికి తెలియకుండా చెట్లచాటునుండి వెంబడించసాగాడు.

మరికొంత దూరం నడిచాక మరొక మోసగాడు ఎదురయ్యాడు. రాంలాల్‌ను చూసి "ఏమిటండీ పంతులుగారు! ఆడకుక్కను తీసుకువస్తున్నారు. పైగా దాన్ని భుజంమీద వేసుకుని వస్తున్నారు. మాఊళ్ళో దీనిని అందరూ రాళ్ళతో కొట్టిపంపించారు. పెంచుకోకపెంచుకోక ఈ కుక్కే దొరికిందా మీకు" అంటూ వేళాకోళంగా మాట్లాడుతూ పకపకా నవ్వసాగాడు.

అప్పుడు రాంలాల్ అతనితో "ఏమిటి? మీ గ్రామస్థులకు ఏమైనా పిచ్చిపట్టిందా? లేక కళ్ళు సరిగ్గా కనబడటంలేదా? ఎందుకని ఈమేకను పట్టుకుని ఆడకుక్క అని అంటున్నారు? అని అడిగాడు.

దానిక ఆ రెండవ మోసగాడు "స్వామీ! మీరెవరో గాని బాగా మోసపోయారు. నిజంగా ఇది ఆడకుక్కమాత్రమే. అంతేకాదు దీనికి జబ్బుకూడా ఉంది. అందుకనే గ్రామస్థులు తన్ని పొలిమేరదాకా తరిమికొట్టారు. మీకేమైనా పిచ్చిపట్టి ఉండాలి! దీన్ని భుజాన వేసుకుని మరీవస్తున్నారు" అన్నాడు.

రాంలాల్‌కు కొద్దిగా సంశయం కలిగింది. "తనకామేకల గురించి తెలీదు.



సంతలో చవగ్గాదొరికింది గదా అని తీసుకున్నాను. దీన్ని చూసి ఒకడు కుక్క అని చెప్పాడు. మరొకడు దీన్ని ఆడకుక్క అని జబ్బుతో ఉన్నదని చెప్తున్నాడు. నిజంగా ఇది కుక్కేనా? దీన్ని ఊళ్ళోవాళ్ళు తన్నిపడేస్తే నాకు తెలియక తెచ్చుకుంటున్నానా?" అనుకున్నాడు.

రెండవ మోసగాడు కూడా వెళ్ళిపోయాడు. రాంలాల్‌కు అనుమానం పెరిగింది గానీ అలాగే దాన్ని తీసుకువస్తున్నాడు. ఇక లాభంలేదు జబ్బుపడిన ఇది కుక్కో లేక మేకో ఏదైతేనేం- దీన్ని భుజానికెత్తుకోవడం ఎందుకు? అని దాన్ని కిందకుదింపి నడిపించుకుని తీసుకువస్తున్నాడు.

రాంలాల్ రాకకోసం ఎదురుచూస్తూ మూడవ మోసగాడు దోవలో నిలబడి ఉన్నాడు. రాంలాల్ మేకను నడిపించుకుని సమీపానికి వచ్చాక అతను "ఏమయ్యా! నీకు ఏమైనా పిచ్చా! జబ్బు పడిన ఆడకుక్కను తీసుకువస్తున్నావు. సరేలే జాగ్రత్తగా ఉండు. ఆ జబ్బు నీకు కూడా సోకే ప్రమాదముంది." అన్నాడు.

రాంలాల్‌కు నిజంగానే అనుమానం కలిగింది. తాను మేక అని పొరబడి కుక్కను తీసుకురావడంలేదుగదా! అనుకున్నాడు. ఒక్కక్షణం దాన్ని పరిశీలనగా చూశాడు. అతనికంటికి అది ఆడకుక్కలాగానే కనిపించింది. దాన్ని వదిలి క్రిందనున్న రాళ్ళు తీసుకుని దాన్ని తరిమి తరిమికొట్టాడు. మేక అలా చెట్లవెంట పారిపోయింది.

రాంలాల్ వట్టి చేతులతో వెనుదిరిగాడు. మేకకోసం కాసుకని కూర్చున్న ముగ్గురు మోసగాళ్ళు దానిని వెతికిపట్టుకుని సంతకు తీసుకెళ్ళి అమ్ముకుని సొమ్ము అందరూ పంచుకున్నారు.

"అందుకనే లోకజ్ఞానం కావాలి. పదిమంది ఏదిచెపితే దానిని గుడ్డిగా నమ్మకూడదు. మనకంటూ ఒక అభిప్రాయం కూడా ఉండాలి. అలాటి అభిప్రాయం లేనందువల్లనే రాంలాల్ నష్టపోయాడు. మోసగాళ్ళ చేతిలో మోసపోయాడు." అన్నది పేదరాశి పెద్దమ్మ తనని కథ చెప్పమని అడిగిన పిల్లలతో.

# చారులత

మహారాజు వీరసేనుని రాజ్యంలో చారుదత్తుడనే బ్రాహ్మణుడు నివశిస్తూవుండేవాడు. చారుదత్తునికి అందమైన, తెలివైన భార్య ఉంది. ఆమె పేరు చారులత. చారులత అంత అందగత్తె రాజధాని నగరంలోనే లేదని చెప్పుకుంటూ ఉంటారు చూసినవారు.

వీరసేనుడు దైవభక్తి పరాయణుడు. వయసు మళ్ళుతున్న కారణంగా వీరసేనుడు రకరకాల పుణ్యక్షేత్రాలు చూసి రావాలని నిర్ణయించుకున్నాడు. రాజులేని రాజ్యం రాజ్యమేకాదు. కాబట్టి తాను తిరిగి వచ్చేవరకూ యువరాజు కీర్తిసేనుని రాజుగా ప్రకటించి కైలాసశిఖరము, మానససరోవరం వంటి యాత్రలకు బయలుదేరాడు. మానససరోవరం వెళ్ళిరావాలంటే చాలా వ్యయప్రయాసలకు ఓర్చుకోవాలి. దారి అంతా ప్రమాదాలతో కూడుకుని ఉంటుంది. అందుకనే తాత్కాలికంగా యువరాజును రాజుగా ప్రకటించి వీరసేనుడు బయలుదేరాడు.

కీర్తిసేనుడు మంచి తెలివిగలవాడు, తండ్రిని మించినవాడుగా అనతికాలంలోనే పేరు పొందాడు. అంతేగాక తాను కొన్ని నియమాలను ఏర్పరచుకొని వాటిని పాటిస్తూ రాజ్యపాలన చేస్తున్నాడు. రాజ్యంలో ప్రజలు తనగురించి ఏమని అనుకుంటున్నారో అని కీర్తిసేనునికి ఆలోచన ఎక్కువ దానిని తెలుసుకోవడానికి వేగులను నియమించాడు. అంతేగాక తానుకూడా మారువేషాలతో నగరంలో పర్యటస్తూ ఉండేవాడు.

ఒకనాడు కీర్తిసేనుడు పురవీధులలో తిరుగుతూ ప్రజల అవసరాల్ని గమనిస్తున్నాడు. ఒంటరిగా మారువేషంలో ఉన్న అతనిని ఎవరూ గుర్తించలేదు. మిట్టమధ్యాహ్నం అయింది. ఎండలో తిరగడం వల్ల అతను అలసిపోయాడు. బాగా దాహంగా ఉంది. చుట్టుప్రక్కల ఏదైనా మంచి ఇల్లుకనబడితే అక్కడికి పోయి దాహం తీర్చుకోవాలని అనుకున్నాడు. చుట్టూచూసేసరికి ఎదురుగా ఒక అందమైన భవనం కనబడింది. అక్కడకు పోయి తలుపుతట్టాడు.

లోపలనుండి ఒక యువతి వచ్చి కోకిల కంఠంతో "ఏం కావాలి?" అని అడిగింది. నీరసంతో తలపైకి ఎత్తకుండానే "దాహంగా ఉంది-కాసిని మంచి నీరు ఇప్పించండి" అని అన్నాడు కీర్తిసేనుడు.

ఆమె లోనికి వెళ్ళి ఒక పాత్రలో మంచినీరు తీసుకుని వచ్చింది. అప్పుడు చూశాడు ఆమెను కీర్తిసేనుడు. ఆమె ఎవరోకాదు చారుదత్తుని భార్య చారులత. ఆమె రూపలావణ్యాలకు ఆశ్చర్యపోయాడు. దోసిలి పట్టి మంచినీరు త్రాగాడు. అంతేగాక ఆమె అందచందాలు అతని మనోఫలకంపై ముద్రించబడిపోయాయి.

అక్కడ చారులత కూడా తనను దాహం అడిగిన వ్యక్తి ఎంత అందగాడు! అతదెవరై ఉంటాడు? అని ఆలోచిస్తూ పదేపదే అతని తలపులలో మునిగిపోయింది. చారులత భర్తచాటు ఇల్లాలు కాబట్టి వెంటనే తలపై ముసుగు వేసుకుని ఇంట్లోకి వెళ్ళిపోయింది.

కీర్తిసేనునికి ఆరాత్రి నిద్రపట్టలేదు. ఆనాటినుండి అతని నియమాలు పద్ధతులు అన్నీ పక్కన పెట్టబడ్డాయి. అన్నం ముట్టలేదు. నీరు త్రాగలేదు. ఎంతసేపూ చారులత ప్రతిరూపాన్ని మనసులో ధ్యానస్తూ జీవితాన్ని గడుపుతున్నాడు. మంత్రులు, ఇతరులకు ఎవ్వరికీ యువరాజు పరిస్థితి అర్థంకాలేదు. రెండుమూడు రోజులు గడిచాయి. యువరాజు చిక్కిపోయాడు.

ఒకనాడు కీర్తిసేనుడు తన అంతరంగికులలో చాతురిక అనే ఒక ఆమెను పిలిచి చారులత ఉండే వీధిగుర్తులు, ఆమె ఇంటిగురించి చెప్పి అది ఎవరిది? ఆమె ఎవరు? ఆమె పేరేమిటి? అనే వివరాలన్నీ తెలుసుకుని రమ్మన్నాడు.

చతురిక చురుకైన యువతి, మంచి తెలివి తేటలు గలది. యువరాజు ఈ విషయం తెలుసుకుని రమ్మన్నాడంటేనే అతను ప్రేమలో పడ్డాడని అర్థంచేసుకుంది. చారులత గురించి ఆచూకీ తెలుసుకోవడానికి బయలుదేరింది.

యువరాజు చెప్పిన గుర్తులప్రకారం చారులత ఉంటున్న ఇంటిని సులభంగానే కనిపెట్టింది. చుట్టుపక్కల వారిని విచారించి అది చారుదత్తుడనే ఒకబ్రాహ్మణునిదని అతని భార్య చాలా అందగత్తె, తెలివైనదని ఆమెపేరు చారులత అని తెలుసుకున్నది. ఇంత తెలుసుకున్నాక అసలు చారులత యువరాజుగురించి ఏమనుకుంటుందో తెలుసుకోవాలనుకున్నది. కొద్దిసేపు వేచివుండి చారుదత్తుడు బయటకు వెళ్ళిన తరువాత ఇంటి తలుపు తట్టింది.

చతురిక తనపేరు చెప్పి "ఒకనాడు ఒక బాటసారి దాహం తీర్చుకోవడానికి మీఇంటికి వచ్చాడు. అప్పటినుండి అతను నీరూపమే ధ్యానిస్తున్నాడు. అతని గురించి నీఅభిప్రాయం ఏమిటి?" అని అడిగింది.

చతురిక సూటిగా అడిగిన దానికి చారులత కాస్తంత సిగ్గుపడింది. తరువాత "ఆ విషయం నీకెలా తెలుసు? - అతను ఎంతో అందమైనవాడు. అటువంటివాణ్ణి నేను ఇంతవరకు చూడలేదు" అని చెప్పింది.

చతురిక ఆ సమాధానం విని తృప్తిపడింది. "అతను ఎవరనుకుంటున్నావు? ఈదేశాన్ని పరిపాలించే రాకుమారుడు. నేను ఆయన సేవకురాలిని. నిన్ను చూచిందే తడవుగా ఆయన ప్రేమలో పడిపోయాడు. నిన్ను పెళ్ళి చేసుకోవాలని అనుకుంటున్నాడు" అని చెప్పింది.

ఆమాటలు విన్న చారులత "అతడు ఈ దేశాన్నేలే మహారాజైనా మరెవరైనాసరే - ప్రస్తుతం నేను పరాధీనను. నాభర్త చారుదత్తుడు. ఈజన్మకింతే. మరోజన్మలో నేను ఆయన భార్యను కాగలనని చెప్పు" అన్నది.



నర్మగర్భంగా చారులత పలికినపలుకులు విని చతురిక తృప్తిపడి రాజాంతఃపురానికి బయలుదేరింది. మహారాజు కీర్తిసేనునికలిసి తాను చేసిన పనిని యావత్తూచెప్పింది. ఆ తరువాత "మహారాజా! మీఇద్దరి కలయికకు అడ్డు చారులత భర్త చారుదత్తుడే! మీరు అతనిని దేశాంతరం పంపితేనే - మీ ఇరువురు కలిసేందుకు అవకాశం ఉంటుంది" అన్నది.

కీర్తిసేనుడు బాగా ఆలోచించాడు. చతురిక పలుకులలోని అంతరార్థం బోధపడింది. మరునాడు చారుదత్తుని తన ఆస్థానానికి పిలిపించాడు. మహారాజు తనను పిలిపించినందుకు చారుదత్తుడు ఎంతో ఆశ్చర్యపోయాడు. మహారాజు చారుదత్తునితో "ఓయీ! నీవు గొప్ప తెలివిగలపండితుడవని తెలిసింది. మేము నీకు అప్పగించ బోయేపనికి నీవే సమర్థుడవని మా అభిప్రాయం!" అన్నాడు.

చారుదత్తుడు వినయంగా "మహారాజా! నేను అందుకు తగినవాడినని భావిస్తే మీరేపనిచెప్పినా చేస్తాను" అన్నాడు.

కీర్తిసేనుడు "ఏమీ పెద్దపనికాదు. మన పొరుగురాజ్యానికి వెళ్ళి అక్కడి రాజుకు నేను పంపే కానుకలను ఇచ్చి మనరాజ్యం తరపున స్నేహబంధాలు కొనసాగించమని చెప్పి, నా మిత్రుడైన ఆ రాజుకు నేను వ్రాసి ఇచ్చే లేఖను ఇవ్వాలి. అంతే" అన్నాడు.

చారుదత్తుడు మహారాజు కీర్తిసేనుడు ఆదేశించినట్లుగా ఒక ఉత్తరాన్ని, కొన్నికానుకలను తీసుకుని పొరుగురాజ్యానికి చేరాడు. అక్కడి మహారాజుకు తానువచ్చిన పనిచెప్పాడు. కీర్తిసేనుడు ఇచ్చిన ఉత్తరాన్ని చదువుకుని జవాబువ్రాసి కొన్ని బంగారు నగలను, వస్తువులను మిఠాయిలను పంపాడు.

చారుదత్తుడు ఆ కానుకలను తీసుకుని కీర్తిసేనుని కలిశాడు. కీర్తిసేనుడు కూడా ఎంతోసంతోషించి "చెప్పిన పనిని సమర్థవంతంగా నిర్వహించావు"





అని మెచ్చుకుని ఆ మహారాజు వ్రాసిని ఉత్తరాన్ని చదివి ఆనందంగా ఉన్నదని చెప్పి మహారాజు పంపిన మిఠాయిలను తీసుకుని తన రాజసభలోని వారందరికీ పంచాడు. అలాగే కొన్ని మిఠాయిలను తాను తిని, కొన్నింటిని చారుదత్తునికి ఇచ్చాడు. చారుదత్తుడు కూడా వాటిని సంతోషంగా తిన్నాడు.

ఆ మరునాడు చారుదత్తుని శవం కోటకు ఒకపక్కనగల తోటలో పడిఉండడం కొందరు చూశారు. అతను ఎలా చనిపోయినదీ ఎవరూ చెప్పలేకపోయారు. ఆత్మహత్య చేసుకున్నాడా! అనడానికి కూడా సరైన కారణాలు కనబడలేదు.

చారులత పతి మరణించినందుకు తీవ్రంగా దుఃఖించింది. ఆతరువాత మహారాజు కీర్తిసేనుడు, సభలో ఒకప్రకటన చేస్తూ "మన మిత్రుడు చారుదత్తుడు ఇంత హఠాత్తుగా మరణించడం బాధకలిగిస్తుంది. ఇంతకుమునుపే ఎంతోసంతోషంగా మనం అందరం మిఠాయిలు కూడా తిన్నాము. అయితే కుటుంబం గురించి వాకబు చేయగా అతనికి పిల్లలు లేరని తెలిసింది.అయితే అతని భార్య ఇప్పుడు వితంతువు. అందగత్తె అని కూడా తెలిసింది. కాబట్టి ఆమెకు సరైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత నాపైన బడింది. అందుచేత ఇకనుండి చారుదత్తుని భార్య చారుల్ష మా రాణివాసంలో సురక్షితంగా ఉంటుందని నేను హామీ ఇస్తున్నాను" అన్నాడు.

ఆవిధంగా కీర్తిసేనుడు చారులతను తనదానిని చేసుకున్నాడు. పాపం బ్రాహ్మణహత్యకు కూడా వెనుదీయలేదు. ప్రియునికోసం చారులతకూడా భర్తను హతమార్చేందుకు సహకరించింది. ఇంతకీ చారుదత్తుడు ఎలా మరణించాడంటే పొరుగుదేశపురాజు పంపిన మిఠాయిలలో కొన్నింటిలో విషం కలిపి ఉంచారు. వాటిని చారుదత్తునికి ఇచ్చారు. అదీకథ అంటూ ముగించింది పెద్దమ్మ.

# కలసి ఉంటే

పూర్వం కేశవపురం అనే ఊళ్ళో రమణయ్య అనేవాడు ఒకడు ఉండేవాడు. రమణయ్య రైతు. కష్టపడి వ్యవసాయం చేసి చాలినంత సంపాదించాడు. అతనికి నలుగురు కొడుకులు. వారుకూడా కష్టపడి పనిచేసి తండ్రికి చేదోడు వాదోడుగా ఉండేవారు. రమణయ్య కొడుకులకు మంచి సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేశాడు. కాలం ఎంత కాలం అలాగే ఉంటుంది? రోజులు గడుస్తున్న కొద్దీ రమణయ్య ఆరోగ్యం క్షీణించసాగింది. వ్యవసాయపు పనులు, ఇతర పనులన్నీ కొడుకులే చూడడం మొదలుపెట్టారు.

అయితే చిక్కంతా అక్కడే వచ్చింది. అప్పటిదాకా కలిసిమెలిసి పనిచేసిన రమణయ్య కొడుకులు వారి పెళ్ళాల మాటలువిని కీచులాడుకోవడం, ప్రతిచిన్న విషయానికీ వాదులాడుకుని పనులుచేయకపోవడం చేస్తున్నారు. మంచానపడిన రమణయ్యకు కొడుకులు ఆవిధంగా ప్రవర్తించడం నచ్చలేదు. అప్పటిదాకా గుట్టుగా సాగుతున్న తమ కుటుంబం పరువు బజారున పడుతుందేమోనని ఆయన భయం. ఎలాగైనా కొడుకులకు నచ్చచెప్పాలని నిర్ణయించుకున్నాడు.

ఈలోగా రమణయ్య ఆరోగ్యం కొద్దిగా కుదుటపడింది. ఒకనాడు తన మంచాన్ని చల్లగాలి వస్తుందని  పెరట్లో వేయించుకుని తన కొడుకులను నలుగురినీ తనవద్దకు రమ్మని కబురుపంపాడు. రమణయ్య కొడుకులంతా తండ్రి తమని ఎందుకు రమ్మన్నాడా! అని ఆలోచిస్తూ అక్కడికి చేరుకున్నారు.

పెరట్లో ఒక మూలన ఒక పొగరు మోతు గిత్త ఉన్నది. దానిని చూపుతూ కొడుకులతో "ఇదుగో నావద్ద ఒకతాడు ఉన్నది. ఈతాడుతో దానిని కట్టేయండి. అని పెద్దకొడుకుకు ఒకతాడు, రెండో కొడుకుకు ఒకతాడు, మూడోవాడికి ఒకటి ఇచ్చాడు. ముగ్గురు కొడుకులూ విడివిడిగా వెళ్ళి ఆ గిత్త మెడకు



తాడుకట్టే ప్రయత్నం చేశారు. అయితే అది వారు కట్టిన త్రాటిని చిటికెలో తెంపేసింది.

అప్పుడు రమణయ్య ముగ్గురిచేతుల్లో నుంచి మిగిలిన త్రాళ్ళను తీసుకుని స్వయంగా పేని ఒకేతాడుగా చేసి చిన్న కొడుకుతో దీనిని ఉపయోగించి ఆ గిత్తను కట్టిపడెయ్యమన్నాడు. చిన్నకొడుకు ఆ తాడు ఉపయోగించి చిటికెలో ఆపనిచేశాడు. గట్టిగాఉన్న ఆతాడు తెంపుకోవడం దానివల్లకాలేదు. అప్పుడు కొడుకులవైపుతిరిగి "మీరుకూడా ఈ తాడు లాంటివారే! ఆ గిత్త మీకు వచ్చేసమస్యలు. ఒక్కొక్కరు వెళ్ళి పరిష్కరించుకోవాలంటే మీరే పాడైపోతారు. మీరు కలిసికట్టుగా ఉంటే చిన్నవాడిచేతికి ఇచ్చిన తాడులాగా గట్టిగా ఉండి, సమస్యలు తేలికగా పరిష్కరించుకోగలుగుతారు. కాబట్టి జీవితంలో మీరెప్పుడూ ఐకమత్యంగా ఉండండి" అన్నాడు. కొడుకులు తమ ప్రవర్తనకు సిగ్గతో తలలు వంచుకుని తండ్రికి తాము ఇకపై కలిసి ఉంటామని ఘాట యిచ్చారు.

# శరభయ్య జబ్బు

సిరిపురంలో శరభయ్య అనే ఒకరైతు ఉండేవాడు. అతనికి కొడుకులు లేరు ఇద్దరు కూతుళ్ళు మాత్రం ఉన్నారు. శరభయ్య వ్యవసాయం చేసి ఎంతో కొంత సంపాదించి ప్రశాంతంగా ఉన్నాడు. శరభయ్యకు భార్య పిల్లల చిన్నతనంలోనే చనిపోయింది. అప్పటినుండి ఆడపిల్లలు ఇద్దరినీ కంటికి రెప్పలా చూసుకొని పెంచుకున్నాడు. పెద్దకూతురు పేరు గంగ, రెండోదానిపేరు ఉమ. గంగకు దగ్గరలో గల ఒక పల్లెటూరిలో మంచి సంబంధం చూసి పెళ్ళికూడా చేశాడు. ఉమ మాత్రం తండ్రివద్దే ఉంటుంది.

ఒకసారి శరభయ్యకు అంటువ్యాధి సోకింది. దానితో అతని ఆరోగ్యం క్షీణించి చివరికి మంచాన పడ్డాడు. ఉమ ఊళ్ళో ఉన్నవైద్యుణ్ణి పిలిపించి చికిత్స చేయిస్తున్నది. వైద్యుడు వచ్చి "ఇది అంటువ్యాధి కాబట్టి రోగికి సంబంధించిన వస్తువులు విడిగా ఉంచాలి. సరిగ్గా పథ్యము చేస్తే, మందులు వాడితే త్వరగా కోలుకుంటాడు" అని చెప్పాడు. ఉమ వైద్యుడు చెప్పినట్లుగానే శరభయ్య అన్నంతినే కంచం, పక్క బట్టలు వంటివి అన్నీ విడిగా ఉంచి పథ్యం కూడా చేయిస్తుంది.

రోగికి పథ్యం రుచించదనే సామెత నిజమనేట్టుగానే శరభయ్య కొద్దిగా కోలుకుని తనపరిస్థితి తెలుసుకున్నాక ఉమ తనను వేరుగా చూస్తుందని భావించి బాధపడ్డాడు. తన కూతురుకు కూడా అంటరానివాడినయ్యానా! అనుకుని తనపెద్ద కూతురు గంగకు కబురుపంపాడు. ఈలోగా వైద్యుడు వచ్చి ఉమ తాను చెప్పినవిధంగానే చేస్తుందని గ్రహించి శరభయ్య కోలుకోవడానికి ఎంతో కాలం పట్టదని చెప్పి వాడవలసిన మందులు ఇచ్చివెళ్ళాడు.

తండ్రి అనారోగ్యంతో ఉన్నాడని తెలిసి గంగ పరుగుపరుగున వచ్చింది.



శరభయ్య తన అవస్థను పెద్దకూతురుకు చెప్పుకున్నాడు. గంగ తండ్రికి ధైర్యం చెప్పి ఉమతో ఆయనకు వచ్చిన జబ్బు అంత తీవ్రమైనది కాదని, ఆయన వస్తువులు వేరుగా ఉంచాల్సిన పనిలేదని చెప్పి, తానే శరభయ్య పనులు చేయడం మొదలుపెట్టింది. ఇక ఉమ మాట వినేవారే లేకపోయారు. కొన్నిరోజులకు కోలుకుంటున్న శరభయ్య ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. అంతేగాక గంగకూడ జబ్బుపడింది. వైద్యుడు శరభయ్యను పరీక్షించి "అపథ్యం జరిగింది అందుకే జబ్బు తిరగబెట్టింది." అని గంగవైపు చూసి "అమ్మాయీ! నువ్వు సరిగ్గా నియమాలు పాటించక పోవడం వల్ల నీతండ్రికి జబ్బు పెరిగింది. నీకు కూడా అది అంటుకున్నది' అని చెప్పాడు.

ఉమ ఇరువురికీ వైద్యుడు సూచించినట్లుగా వారి వస్తువులు వేరుగా ఉంచి సేవలు చేసింది. ఇద్దరూ కొద్దికాలంలోనే కోలుకున్నారు. భార్య ఇంకా పుట్టింటినుంచి రాలేదేమిటి! అని గంగ భర్త వచ్చాడు. గంగచేసిన నిర్వాకానికి భార్యను చివాట్లు పెట్టి ఇంటికి తీసుకుపోయాడు.

"కన్నతండ్రిపై ఎంత ఆపేక్ష ఉన్నా కొన్నిసార్లు కొంతమంది చూపే ఆపేక్ష నిరర్థక ఆపేక్షే అవుతుంది గంగకున్న ఆపేక్షలాగా! దానివల్ల సత్ఫలితంకంటే నష్టమే ఎక్కువ. ఉమకు కూడా తండ్రిపై ప్రేమ ఉన్నా ఆయన ఆరోగ్యం బాగుపడాలనే కఠిన నియమాలను పాటించింది." అని చెప్పింది పెద్దమ్మ.

# జిత్తుల మారి భార్య


సోనాపురంలో మందబుద్ధి అనేపేరుగల వర్తకుడు ఒకడు ఉండేవాడు. అతను చాలా మంచివాడు, సౌమ్యమతు, నిదానస్తుడు. అతన్ని చూసి ఆ గ్రామంలో అందరూ అతన్ని అభిమానిస్తూ వుండేవారు. చేసేది వ్యాపారమైనా లాభాపేక్ష లేనివాడు. అదికూడా అందరూ అభిమానించడానికి కారణమై ఉండొచ్చు.

మందబుద్ధికి ఒక భార్య వుంది. ఆమెపేరు చతురిక. చతురిక స్వభావం మందబుద్ధిస్వభావానికి పూర్తిగా విరుద్ధం. ఆమె జిత్తులమారి గయ్యాళి. ఎంతసేపు భర్తను ఆడిపోసుకుంటూ వుంటుంది.

మందబుద్ధి తాతగారు గొప్ప వ్యాపారం చేసి పెద్దమొత్తంలో ధనం సంపాదించారు. విలువైన ధనరాసులను తన తదనంతరం తనవారసులకు అందేలాగా నిక్షిప్తం చేశాడు. మందబుద్ధికి ఆవిధంగా ఎంతో విలువైన ఆస్తులు దక్కాయి. మందబుద్ధి మృదుస్వభావం వల్ల, చతురిక గయ్యాళితనం వల్ల ఆస్థిపైనా చతురిక అందచందాలపైన కన్నేసిన దుర్జనుడు ఏదో ఒకనెపంతో తన మాటల చాతుర్యంతో చతురికకి అభిమానపాత్రుడయ్యాడు.

భర్త మందబుద్ధితనం నచ్చని ఆమె ఎక్కువగా దుర్జనునితో మాటలాడడంతో చుట్టుపక్కలవారు గుసగుసలు పోయేవారు. మందబుద్ధి అంటే అభిమానం ఉన్నవారు అయ్యోపాపం అనుకునేవారు. చతురిక, దుర్జనుడు ఎంత దగ్గరయ్యారంటే ఇద్దరూ ప్రతిరోజు ఒకరినొకరు కలవకుండా ఉండలేరు. మందబుద్ధి దుకాణానికి వ్యాపారనిమిత్తం పోయిన వెంటనే దుర్జనుడు ఇంట్లో దూరేవాడు.

చివరకు చతురిక, దుర్జనుడు ఇద్దరూ కలిసి ఒక పథకం వేసి దానిప్రకారం మందబుద్ధిని హత్యచేయాలని కూడా నిర్ణయించుకున్నారు. ఆ తరువాత



ఇద్దరూ ఒకరినొకరు పెళ్ళిచేసుకుని జీవితాన్ని జల్సాగా గడపాలని, మందబుద్ధికి వంశపారంపర్యంగా లభించిన సంపద ఫలాల్ని అనుభవించాలని నిర్ణయించుకున్నారు. ఈవిషయాన్ని వారు చాలాగోప్యంగా ఉంచారు. అయితే పొరుగిళ్ళలో ఉండేవారు. వీరి వాలకాన్ని కనిపెట్టి మందబుద్ధిని జాగ్రత్తగా ఉండాలని, చతురికవిషయం పలురకాలుగా చెప్పారు.

మందబుద్ధికి ఏమాత్రం అనుమానంరాలేదు. అందరూ ఎంతోచెప్పినా భార్య చతురికపై ఎంతో నమ్మకం ఉంది! ఎందుచేతనంటే తాను తన సంపాదన అంతా తీసుకొచ్చి చతురిక చేతిలో పోస్తున్నాడు.ఏరోజుసంపాదన ఆరోజు లెక్కవేసి ఇస్తున్నాడు.

ప్రతిరోజూ తాను సాయంత్రం ఇంటికి చేరుకోగానే చతురిక సామాన్యగృహిణిలాగానే ఇంటిపనులు చేస్తూ కనబడేది. ఆమెలో ఎలాటి కుతంత్రము అతనికి కనబడేదికాదు.

ఏదేమైనప్పటికీ ఒకవిషయం వ్యాపించాలంటే అంతగా శ్రమపడనక్కరలేదు. ముఖ్యంగా పదిమంది మంచి విషయాలను మాట్లాడడం కంటే చెడ్డ విషయాలను ప్రచారం చేస్తుండడంలో ముందుంటారు. అనతికాలం లోనే చతురిక, దుర్జనుల వ్యవహారం గ్రామం అంతా పాకిపోయింది. మందబుద్ధి స్నేహితులంతా అతని చుట్టూ చేరి ఈవ్యవహారాన్ని గురించి అడుగుతూ అతన్ని చేతకాని వాడని గేలిచేయడం మొదలుపెట్టారు. ఈమాటలన్నీ విన్న మందబుద్ధికి కూడా నిప్పులేనిదే పొగరాదు అనిపించి ఎలాగైనా ఈవిషయంలో నిజానిజాలు తెలుసుకోవాలని అనుకున్నాడు.

ఒకరోజు భార్యతో తాను అత్యవసరపనిమీద రేపు పొరుగూరు వెళ్ళుచున్నాని చెప్పాడు. ఆవిధంగానే మరునాడు ఊరువెళ్తున్నాను అని మరోమారు చెప్పి బయటకు వెళ్ళాడు. అంతకుముందే చతురిక, దుర్జనునికి



కబురుపెట్టింది. దుర్జనుడు మందబుద్ధి ఎప్పుడు బయటకెళతాడా అని ఎదురుచూస్తున్నాడు. ఇప్పుడు మందబుద్ధి అలా బయటకు వెళ్ళిన వెంటనే దుర్జనుడు లోపలికి ప్రవేశించాడు.అయితే బయటకు వెళ్ళిన మందబుద్ధి పెరటిగుమ్మం ద్వారా లోనికి వచ్చి ఇంట్లో మంచం కింద దాక్కున్నాడు.

చతురిక, దుర్జనుడు అదేమంచంపైన కూర్చుని కబుర్లాడుకుంటున్నాడు. ఏదో సరదాగా పలువిషయాలను మాట్లాడుకున్నారు. వారిసంభాషణలన్నీ మందబుద్ధి మంచంక్రింద నుండి వింటూనే ఉన్నాడు. ఈలోగా చతురిక మంచం అంచున కూర్చుని కాళ్ళు ఊపసాగింది. అప్పుడు ఒకకాలు మందబుద్ధికి కొద్దిగా తగిలింది. మంచి తెలివి తేటలుగల చతురికకు మంచం క్రింద ఎవరో ఉన్నట్లుగా తోచింది. అంతేకాక ఆమె భర్తే అక్కడకు మళ్లీ వచ్చి ఉంటాడని కూడా అనుమానం కలిగింది. అయితే ఏమీ తెలియని దానిలాగా ఉండిపోయింది.

అప్పుడు ఉన్నట్లుండి చతురిక మందబుద్ధి గురించి ప్రస్తావిస్తూ నాకు అటువంటి భర్త దొరకడం నా అదృష్టం. నేను ఎన్నిపూజలు చేసానోగాని ఇటువంటి భర్త లభించాడు. అతను పేరు మందబుద్ధికానీ మనిషిమాత్రం ఎంత బుద్ధిమంతుడో! లోకులు పలురకాలుగా అనుకుంటున్నా నన్ను అనుమానించలేదు. మునుపటిలాగా ఎంతోప్రేమగా చూసుకుంటున్నారు. నీతో నేను కాలక్షేపానికి స్నేహంగా ఉన్నాను అయినా ఆయన నన్ను పల్లెత్తుమాట అనలేదు. నాపై ప్రేమ ఎక్కడ చెడిపోతుందో అని నేను గయ్యాళితనం నటిస్తుంటాను. ఈరోజు ఆయన ఊళ్ళో లేరు ఈ సమయంలో నువ్వు ఇక్కడకు రావడం అంతమంచిది కాదు" అన్నది.

హఠాత్తుగా చతురిక అలా మాట్లాడడంతో దుర్జనుడు నిశ్చేష్టుడయ్యాడు. అతనికి చతురిక మాటలు శూలాల్లాగా తగిలాయి. తనభర్త వూరువెళ్తున్నాడు

రమ్మని చెప్పి కబురంపింది. ఆమె ఇప్పుడు ఇలా మాట్లాడుతుంది. కాస్త తెప్పరిల్లిన తరువాత "చతురికా! ఏమిటినువ్వు మాట్లాడేది?" అన్నాడు.

చతురిక వెంటనే కలుగజేసుకుని నేను నిజమే చెబుతున్నాను. అన్నది. దానితో దుర్జనుడు ఛివాలున లేచి విసవిస నడచుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు. మంచంక్రింద దాక్కుని వీరి సంభాషణ అంతావింటున్న మందబుద్ధికి ఎక్కడలేని సంతోషం కలిగింది. అప్పటికప్పుడే బయటకు వచ్చి గంతులెయ్యాలనిపించింది.

దుర్జనుడు వెళ్ళడంతో చతురికకూడా లోపలకు వెళ్ళింది. మందబుద్ధి మంచంక్రిందనుండి బయటకు వచ్చి మంచం చుట్టూ గంతులు వేస్తూ తిరిగాడు. ఆతరువాత నిదానంగా బయటకు వెళ్ళిపోయాడు. బయట తనను ఏగతాళి చేసిన స్నేహితులతో తనభార్య అన్నమాటన్నింటినీ యధాతథంగా చెప్పాడు. దాని నమ్మినవారు ఫరవాలేదే! అనుకున్నారు. కానీ కొందరు మాత్రం చతురిక మళ్ళీ మోసం చేసింది! అనుకున్నారు.

ఏదిఏమైనా చతురిక వంటి భార్యలు ఉండడం వల్ల మందబుద్ధి లాంటి భర్తలకు ఎప్పటికైనా ప్రమాదమే!

"ఎప్పటికెయ్యది మాటలాడి ...అనే శతకకారుని పద్యం మనకు గుర్తురాకమానదు కదా!" అన్నది పేదరాశి పెద్దమ్మ కథను ముగిస్తూ.



# దొంగలు - దొరలు

నారాయణపురం జమీందారీలో తరచుగా దొంగతనాలు జరుగుతున్నాయి. దొంగలను పట్టుకోవడానికి రక్షకభటులు ఎంతో ప్రయత్నాలు చేశారు. అయితే వాటిలో ఏ ఒక్కటీ ఫలించలేదు. దొంగతనాలు మాత్రం యధేచ్ఛగా జరుగుతూనే ఉన్నాయి. అసలు దొంగలు ఏరూపంలో వస్తున్నారో తెలీదు. వాళ్ళు రకరకాల వేషాలతో పగలల్లా తిరిగి రాత్రికి మంచి ఇళ్ళు దోచుకుంటూ వుంటారు.

ఆ విధంగా ఒకరోజు రాత్రి తిరిగారు. అయితే ఒక గ్రామంలోని ప్రజలు వీరిని చూసి దొంగలనుకుని కొట్టబోయారు. అప్పుడు వారు తాము దొంగలం కాదని దొంగలను పట్టుకోవడానికి మారువేషంలో తిరుగుతున్న రక్షకభటులమని చెప్పి తమగుర్తింపు పత్రాలను చూపితేగాని వారు నమ్మలేదు.

రక్షకభటాధికారి ఒకరోజు రక్షకభటులను పిలిచి "సీతానగరంలో ఈరోజు దొంగలు పడతారని తెలిసింది. కాబట్టి మనం ఆప్రాంత లో ఉంటే సరిపోతుంది. దొంగలు రక్షకభటుల్నిచూసి రాకుండానేపోతారు. కాబట్టి మనం దొంగల వేషంలో వెళ్తే వారిని తేలికగా పట్టుకోవచ్చు" అన్నాడు. దొంగలవేషంలో ఉన్న రక్షకభటులు ఆరోజురాత్రి సీతానగరం అంతా దొంగలకోసం తిరిగారు. తెల్లవారుతుందనగా కొందరు రక్షకభటులు వారికి కనిపించారు. దొంగలవేషంలో ఉన్నవారు వారిని "ఎవరైనా దొంగలు కనబడ్డారా?" అడిగారు. దానికివారు - "లేదు మేము కూడా వెతుకుతున్నాం" అని వెళ్ళిపోయారు.

తెల్లవారిన తరువాత రక్షకభటాధికారి దొంగలవేషంలో ఉన్నవారిని పిలిపించి "మీరు రాత్రి సీతానగరంలో గస్తీ తిరిగారా?" అని అడిగాడు. "తిరిగాము ప్రభూ మాకు దొంగలు ఎవరూ కనబడలేదు. కానీ తెల్లవారుజామున కొందరు రక్షకభటులు కనిపించారు. వారిని కూడా

అడిగాము. వారుకూడా దొంగలు రాలేదని చెప్పారు" అన్నారు.

రక్షకభటాధికారి తలపట్టుకుని "మీరు దొంగలవేషంలో వస్తే దొంగలు మీ వేషంలో వెళ్ళి దోచుకున్నారు. వారు నిజంగా రక్షకభటులైతే మిమ్మల్ని పట్టుకునే వారే కదా! నిన్న నేను మిమ్మల్ని తప్ప వేరే ఎవరినీ సీతానగరంలో గస్తీకి పంపలేదు" అన్నాడు.

"పైపైవేషాలు వేసినప్పటికీ వారి స్వభావాలలో మార్పులేక పోవడంతో రక్షకభటులకు దొంగలు దొరక్కతప్పించు కోగలిగారు" అన్నది పేదరాశిపెద్దమ్మ.

## దేవదత్తుని కథ

కోసల రాజ్యంలో దేవదత్తుడనే బ్రాహ్మణ యువకుడు నివసిస్తూండేవాడు. పెద్దలు సంపాదించిన ఆస్తులతో జీవితం వెళ్ళబుచ్చుతుండేవాడు. కొన్నిరోజులకు సుమతి అనే ఒక యుక్తవయస్కురాలైన కన్యతో అతనికి పెళ్ళి అయింది. సుమతికి పెళ్ళికి ముందు కొద్దిరోజులలో పెళ్ళిజరుగుతుందనగా తల్లిదండ్రులు చనిపోయారు. ఆమె అనాథ అయింది.


దేవదత్తుడు ఆమెను చాలా ప్రేమగా చూసుకుంటుండేవాడు. దేవదత్తుడు గొప్ప దైవభక్తి పరాయణుడు. భార్యపైన దేవదత్తునికి ఎంతప్రేమంటే అతను రోజూ దేవుణ్ణి ప్రార్థిస్తూ "దేవా! నాభార్యను చక్కగా చూడు. ఆమె అనుభవించే బాధలు నాకు ప్రసాదించు. ఆమెను బాధించకు. ఆమెకు జబ్బుచేస్తే దానిని నాకు అప్పగించు. ఆమెను విడిచిపెట్టు" అనే కోరుకునేవాడు.

ఒకసారి దేవదత్తుని మేనమామకు ఆరోగ్యం సరిగాలేదనితెలిసింది. అతను నివసించే గ్రామానికి దేవదత్తుని గ్రామానికి మధ్య ఒక అడవివుంది. ఆ అడవిలో ఉండే కాలిబాట వెంట రాకపోకలు సాగిస్తూ వుంటారు. దేవదత్తుడు భార్యను వదిలి ఉండలేడు. కాబట్టి మేనమామను చూడడానికి భార్యతో పాటు బయలుదేరాడు.



ఉదయాన్నే బయలుదేరి చకచక నడుస్తూవెళ్తున్నారు. అలా వారు నడుస్తూ నడుస్తూ మిట్టమధ్యాహ్నానికి అడవిమధ్య భాగానికి చేరుకున్నారు. భర్తతోపాటు నడవలేక సుమతి అలసిపోయింది. పైగా ఎండ వేడిమికి తాళలేక అమిత దాహంగా ఉందని భర్తతో చెప్పింది. దేవదత్తుడు ఆమెను ఒకచెట్టు వద్దకు తీసుకెళ్ళి దాని నీడలో ఆమెను విశ్రాంతి తీసుకోమని చెప్పి తాను మంచినీరు ఏదైనా దొరుకుతుందే మోనని చేత చిన్నపాత్రతో వెళ్ళాడు. కొద్దిదూరంలోనే ఒకసెలయేరు కనిపించింది. తాను దాహం తీర్చుకుని తానుతెచ్చిన పాత్రలో భార్యకు నీరు నింపుకుని బయలుదేరాడు.

ఈలోగా ఒంటరిగా ఉన్న సుమతి ఎండకు తాళలేక అమితదాహంతో ఉన్నది. బాగా నీరసంగా ఉండి దేవదత్తుని రాకకోసం ఎదురు చూస్తూఉంది. చివరకు ఆమె స్పృహ తప్పిపడిపోయింది కూడా. అదేసమయానికి ఆ దోవగుండా ఒక నవయువకుడు వస్తూ చెట్టు క్రింద స్పృహ తప్పిపడిపోయిన స్థితిలో ఉన్న సుమతిని చూసి తనవద్ద ఉన్ననీటిని ఆమె ముఖంపై చిలకరించాడు. తరువాత ఒకపెద్ద ఆకును తీసుకుని గాలివచ్చేలాగా వీస్తూ ఉపచారాలు చేశాడు. అతను చేసిన ఉపచారాలకు సుమతికి స్పృహవచ్చింది. తాను ఒక యువకుని తొడపైన తలపెట్టుకుని పడుకుని ఉంది. కనులు తెరిచిన ఆమె తనకు ఉపచారాలు చేస్తున్న యువకుని అందచందాలకు ముగ్ధురాలైంది. క్షణంలో ప్రేమలోపడింది. ఆ యువకునికి కూడా సుమతి అందాలకు మోహావేశం కలిగింది. అయితే సుమతి ఆ రకమైన భావావేశంతో ఆమెకు కలిగిన నీరసంవల్ల తల వేలాడేసి మరణించింది. సుమతికి ఉపచారాలు చేస్తున్నయువకుడు ఆమె నాడిని పరీక్షించి ఆమె మరణించిందని నిర్ధారించుకున్నాడు. ఆమెను ఏమిచేయాలో తోచక అలాగే ఉండిపోయాడు.





ఈలోగా నీటిని తీసుకురావడానికి వెళ్లిన దేవదత్తుడు అక్కడకు వచ్చాడు. సుమతి తలను తన ఒడిలో ఉంచుకుని పరిచర్యలు చేస్తున్న యువకుని చూశాడు. ఆమెకు ఏమైందోననే ఆతృతతో పరుగుపరుగున అక్కడికి చేరుకున్నాడు. ఆ యువకుని ద్వారా ఆమె మరణించినదని తెలుసుకుని విచారించాడు. అయితే దైవభక్తి పరాయణుడు కాబట్టి దేవుని ప్రార్థించాడు. మనస్సు లగ్నంచేసి “దేవా! నాజీవితంలో సగం నాభార్యకివ్వు తనని బ్రతికించు” అని మూడుసార్లు ఉచ్చరించాడు.

ఆశ్చర్యంగొలిపేలాగా సుమతి కళ్ళు నులుముకుంటూ లేచి కూర్చుంది. ఆమె భర్తపక్కన ఉన్న యువకుని ప్రేమలో పడింది. అతను కూడా ఆమెపై ప్రేమతో ఉన్నాడు. దేవదత్తునికి మాత్రం ఇవేమీతెలీవు. ఆయనకుడా తనభార్యకు ఉపచారం చేశాడనే అనుకుంటున్నాడు. ఈసారి ముగ్గురూ కలిసి బయలుదేరారు.

కొంతదూరం నడిచాక సుమతి తనకు దాహంగా ఉన్నదని చెప్పింది. దేవదత్తుడు పాత్రతీసుకుని నీటికోసం బయలుదేరాడు. కొద్దిదూరంలోనే ఒక దిగుడు బావి కనిపించింది. ఆ బావిలో నీళ్ళు ఎలా ఉన్నాయో చూద్దామని దేవదత్తుడు బావి అంచుకు వెళ్ళి తొంగిచూశాడు. అతని వెనకాల వచ్చిన యువకుడు అదే సరైన సమయం అని భావించి దేవదత్తుని బావిలోనికి తోసివేశాడు.

దేవదత్తుడు బావిలోపడిపోయాక ఆ యువకుడు–సుమతి వద్దకు చేరుకుని తనపేరు శేఖరుడని చెప్పి – దేవదత్తుని తాను బావిలోనికి త్రోసిన సంగతి చెప్పాడు. సుమతి శేఖరుడు చేసినపనికి ఎంతో సంతోషించింది. ఇద్దరూ కలిసి చెట్టాపట్టాలు వేసుకుని పాటలు పాడుకుంటూ వెనుకకు బయలుదేరారు. అలా వాళ్ళిద్దరూ ఆదమరిచిపోయి కొంతదూరం వచ్చాకగానీ తాము

దారితప్పినట్లు గుర్తించలేదు.

వాళ్ళు పొరుగు రాజ్యంలోనికి ప్రవేశించారు. అంతలో ఆదేశపు రక్షకభటులు వీళ్ళిదరినీ గొలుసులతో బంధించి మహారాజుముందు సభలో హాజరుపరచారు. మహారాజు "మీరెవరు? ఏదేశంనుండి వచ్చారు? మీరు గూఢచారులా?" అంటూ ప్రశ్నించాడు. అప్పుడు సుమతి "మహాప్రభూ! మాది పొరుగు రాజ్యం. మేము పేదబ్రాహ్మణులం. ఇతను నాభర్త. జీవనోపాధిలేక, ఆకలికి తాళలేక ఇలా దేశాలు పట్టిపోతున్నాము. తమరు దయతలిచి మాకు ఆశ్రయం కల్పిస్తే మీమేలు ఈజన్మలో మరువలేము" అన్నది.

సుమతి చెప్పిన మాటలు రాజును జాలిగొలిపేలాగా చేశాయి. మహారాజు శేఖరునికి ఒక నివాసగృహాన్ని కేటాయించి తన ఆస్థానంలో గాయకుడిగా నియమించాడు. ఇలా కొంతకాలం గడిచింది. ఇక అక్కడ దేవదత్తుని విషయానికి వస్తే - దిగుడు బావిలోనికి త్రోయబడిన దేవదత్తుడు లోపల ఉన్న ఒకరాతి ఫలకంపై పడిపోయాడు. అతనికాలు విరిగింది. బయటకు రాలేక అక్కడే మూలుగుతూ ఉండిపోయాడు.

అదేదారిన పోతున్న ఒక వడ్రంగి దిగుడు బావినుండి మూలుగు వినిపించి వచ్చి దేవదత్తుని లేవదీసి పరిచర్యలు చేశాడు. తనవద్ద ఉన్న ఒక కర్రను అతనికి ఊతముగా ఇచ్చి సమీపానగల తనగ్రామానికి తీసుకుపోయాడు. అక్కడే దేవదత్తునికి ఒక వైద్యునితో చికిత్స చేయించాడు.

అనతికాలంలోనే కోలుకున్న దేవదత్తుడు తన భార్య సుమతి గురించి వెతకడం మొదలుపెట్టాడు. తాను భార్యను వదిలిపెట్టిన చోటకు చేరి వెతకగా ఒకచోట సుమతి చేతి కంకణం కనిపించింది. అక్కడనుండి ఇరువురి అడుగుజాడలను గుర్తు పట్టుకుంటూ సుమతి నివశిస్తున్న పొరుగు రాజ్యానికి చేరాడు. అక్కడ రాజధాని నగరంలో తిరుగుతూండగా ఒకచోట సుమతిని,



శేఖరుని చూశాడు. సుమతి దూరంనుండే అతన్ని చూసి గబగబా రాజుగారి మందిరం వైపు బయలుదేరింది. వెనువెంటనే శేఖరుడు కూడా ఆమెతో పాటుగా వచ్చాడు.

దేవదత్తుడు వారిని చూసి తాను కూడా అక్కడకు చేరుకోబోతుంటే ఆగంతుకుడుగా గుర్తించి రాజభటులు అడ్డగించారు. రాజుగారి వద్దకు వెళ్ళిన సుమతి మహారాజుతో "మహరాజా! ఎవరో ఒకవ్యక్తి వచ్చి నాప్రాణాలు తీస్తానని బెదిరిస్తూ ఉన్నాడు" అన్నది.

మహారాజు ఆమెను ఊరడిస్తూ "ఎక్కడున్నాడు?" అని అడిగాడు.

"మహారాజా! తమమందిరం వెలుపల ఉన్నాడు" అన్నది.

మహారాజు భటులతో ఈమె చెప్పిన ఆగంతుకుడికి మరణశిక్ష విధిస్తున్నాను. రేపు సభకు తీసుకురండి.అతని ఆఖరికోరిక ఏమిటో అడిగి శిక్ష అమలుచేయండి" అన్నాడు.

దేవదత్తుని బంధించి ఆ మరునాడు అతనికి ఉరిశిక్ష అమలు చేసేందుకు నిర్ణయించారు భటులు. మరునాడు ఉరిశిక్ష పడిన దేవదత్తుని రాజసభకు తీసుకుని వచ్చారు. మహారాజు అతనితో "ఏమోయీ! నీకు ఉరిశిక్ష విధిస్తున్నాం. నీ ఆఖరి కోరిక ఏమిటో చెప్పుకో" అన్నాడు.

దేవదత్తుడు "మహారాజా! నాగురించి ఏమీ తెలుసుకోకుండానే, నేను ఏ నేరం చేయకుండానే ఉరితీస్తున్నారెందుకు?" అని అడిగాడు.

మహారాజు "నువ్వు సుమతిని, ఆమె భర్తను హతమార్చేందుకు ప్రయత్నిస్తున్నావని నీమీద అభియోగం మోపబడింది. దానిని రుజువు చేస్తున్నట్లుగానే నువ్వు వారిని తరుముకుంటూ రాజభవనం వద్దకు వచ్చి భటుల చేతికి చిక్కావు గదా! ఇంకా వేరే విచారణ జరపాలా?" అన్నాడు.

దానికి దేవదత్తుడు "మహారాజా! సుమతి నాభార్య! గత పదిసంవత్సరాల

క్రితం మాపెళ్ళి జరిగింది. అంతేకాదు మేము అడవిలో వస్తుండగా ఒకసారి ఆమె మరణించింది. అప్పుడే నేను దేవుని ప్రార్థించాను. దానితో ఆమె మరల పునర్జీవితురాలైంది. ఆ తరువాత విధివశాత్తూ మేము విడిపోయాము"అన్నాడు.

మహారాజుకు ఇదంతా కట్టుకథలా తోచింది. "నువ్వు చెప్పేమాటలు నమ్మదగినవిగా లేవు. దీనిని రుజువు చేయగలవా?" అన్నాడు అంతేగాక దేవదత్తుని పిచ్చివాడిగా జమకట్టాడు.

దేవదత్తుడు "మహారాజా! అంతా భగవంతుడు చూసుకుంటాడు. మీరు సుమతితో "నేను నాజీవితాన్ని నాభర్తకు తిరిగి ఇస్తున్నాను. ఓదేవా! నన్ను అనుగ్రహించు" అని ప్రార్థించమని చెప్పండి. నేను ఆమెను ప్రేమిస్తున్న నిజమైన భర్తనో! కాదో తెలుస్తుంది" అన్నాడు.

మహారాజుకు ఆ ప్రార్థనలో ఏముంటుంది? ఆమె భర్తకు గాక జీవితాన్ని ఎవరికి ఇస్తారు? అనుకుని సుమతిని "ఆవిధంగానే ప్రార్థించి చూడు - దానివల్ల ఇబ్బంది ఏముంది? నువ్వేమీ అసత్యమాడడం లేదుకదా!" అన్నాడు.

సుమతి సరే అని అదేవిధంగా ప్రార్థించింది. సభ అంతా ఆశ్చర్యపోయేలాగా సుమతి దబ్బుమని నేలపై పడిపోయింది. రాజవైద్యుడు ఆమెను పరీక్షించి ఆమె మరణించిందని చెప్పాడు. మహారాజుకు విషయం అర్థమైంది. శేఖరుడిని తక్షణం బంధించమని చెప్పి దేవదత్తుని ఉరిశిక్ష నుండి తప్పించాడు. దేవదత్తుడు అదేరాజ్యంలో మరొకస్త్రీని పెళ్ళిచేసుకుని మహారాజు వద్ద శేఖరుని స్థానంలో గాయకుడిగా నియమితుడయ్యాడు.



# భల్లూక మాంత్రికుడు

విదర్భరాజ్యాన్ని ఒకానొకప్పుడు మాధవసింహుడు రాజుగా పరిపాలిస్తుండేవాడు. అతని కుమార్తె కళావతి అతిలోక సౌందర్యవతి - ఆమె సౌందర్యాన్ని గురించి దేశదేశాల రాజకుమారులు, ప్రజలు గొప్పగా చెప్పుకొనేవారు. ఆమెకు యుక్తవయస్సు వచ్చిన తరువాత రాజుకు ఆమెపెళ్ళి చేయాలని ఆమెకు స్వయంవరాన్ని ప్రకటించాడు. వివిధదేశాల రాజులు మాధవసింహుని ఆహ్వానం మేరకు విదర్భకు ప్రయాణమయ్యారు.

విదర్భ రాజ్యానికి ఉత్తరదిక్కున గొప్ప అడవులు, పర్వతాలు ఉన్నాయి. అటువైపు వెళ్ళినవారు ప్రాణాలతో తిరిగిరావడం కష్టమని విదర్భ ప్రజలనమ్మకం.అందుకు కారణం కూడాఉంది. అక్కడ ఉన్న అడవిలో ఒక కొండగుహలో భల్లూక మాంత్రికుడు ఉన్నాడు. వాడు తన మాయలను ఉపయోగించి అక్కడకు చేరిన బాటసారులను ఇబ్బంది పెట్టి చివరికి చంపేవాడు. వాడు క్రూరుడు.

భల్లూకమాంత్రికుడు అప్పుడప్పుడు విదర్భరాజ్యానికి కూడా వస్తూఉండేవాడు. అయితే అలావచ్చినప్పుడు ప్రజలను ఏమీ చేయకుండా తనపని తాను చూసుకుని వెళ్ళిపోయేవాడు. వాడి ఆకారం కూడా భయంకరంగా ఉండేది. పెద్దపెద్ద కళ్ళు జడలు కట్టిన జుట్టు.పైగా గూని కూడాఒకటి చేతిలో ఒకకర్ర అదిమంత్ర దండమేమో! వాడిని చూస్తేనే విదర్భరాజ్యప్రజలు భయపడుతూ వాడు అడిగినవి ఇచ్చేస్తారు. ఊహ తెలిసిన పిల్లలయితే వాడు వస్తున్నాడని చెపితేచాలు ఎంత అల్లరి చేసేవారైనా కుక్కిన పేనుల్లాగా ఉండిపోతారు.

విధర్భ రాజకుమార్తె కళావతి స్వయంవరం ప్రకటనలు వాడవాడలా ప్రకటించబడ్డాయి. సరిగ్గా ఇదేసమయంలో అడవినుండి భల్లూకమాంత్రికుడు


విదర్భరాజ్యానికి వచ్చాడు. అక్కడి ప్రజలందరూ కళావతి అందచందాల గురించి చెప్పుకుంటుంటే ఒకసారి ఆమెను చూస్తే బావుంటుందని భల్లూకమాంత్రికుడు అనుకున్నాడు.

రహస్యంగా ఎవరికీ కనబడకుండా వెళ్ళి అంతఃపురంలోని ఉద్యానవనంలో ఒక పొదచాటున దాక్కున్నాడు. అక్కడికి దగ్గరలోనే ఉద్యానవనంలో అంతఃపురంలో స్త్రీలు స్నానమాడే కొలను ఉంది. రాకుమార్తె ఆమె చెలికత్తెలు ఉద్యానవనంలో విహరించి కొంతసేపయిన తరువాత స్నానంచేయడానికి కొలను దగ్గరకు చేరారు. కళావతి అద్భుత సౌందర్యాన్ని చూసిన భల్లూక మాంత్రికుడు ప్రేమలోపడ్డాడు.

ఎలాగైనా సరే తన ప్రేమవిషయం ఆమెకు తెలియజేసి ఆమె ఆమోదం పొంది; పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు.

తటాలున పొదలోనుండి ఇవతలకు వచ్చి, రాజకుమార్తె దగ్గరకు వచ్చాడు. అతని భయంకరాకారాన్ని చూసిన చెలికత్తెలలో కొందరు అరచుకుంటూ పరుగెత్తారు. మరికొందరు స్పృహ తప్పి పడిపోయారు. రాకుమార్తె కళావతి కూడా అతన్ని చూసి భయంతో బెదిరిపోయింది. రాకుమార్తెను చూసి "రాకుమారీ! నేను భల్లూకమాంత్రికుడిని! నాపేరు చెపితే దేశదేశాల రాజులు గడగడలాడతారు. పసిపిల్లలు పాలుకూడా త్రాగరు. కాబట్టి నాలాంటి సమర్థుడిని పెళ్ళిచేసుకో"అన్నాడు.

కళావతి రాచకన్య కాబట్టి కాస్త ధైర్యం తెచ్చుకుని పెద్దగా అరుచుకుంటూ అంతఃపురంలోనికి పరుగెత్తింది. భల్లూకమాంత్రికుడు వికటంగా నవ్వుతూ కొంతదూరం ఆమెను వెంబడించాడు. భల్లూకమాంత్రికునికి రాకుమార్తె రేపు స్వయంవరంలో తనను వరించదని అర్థమైపోయింది. ఆమెను పొందాలంటే కేవలం ఆమెను ఆపహరించుకుని వెళ్ళిపోతేనే అని అర్థమైంది. ఆమెను అపహరించడానికి తన మంత్రశక్తుల్ని ఉపయోగించాలని అనుకున్నాడు.



ఆరోజు రాజోద్యానవనంలో జరిగిన సంఘటన క్షణాల్లో మహారాజుకు తెలిసిపోయింది. మహారాజు తీవ్రమైన ఆందోళనలోపడి రాకుమార్తెకు, ఆమె మందిరానికి కట్టుదిట్టమైన కాపలా ఏర్పాటుచేశాడు. అంతేగాక కోటలోపలకు ప్రవేశించేందుకు కూడా వీలు లేకుండా కాపలా అధికం చేశాడు. స్వయంవరం కోసం వచ్చిన రాజకుమారులలో ఒక యువకుడు మహారాజును కలసి తాను స్వయంగా కోటచుట్టూ ఉన్న కాపలాను కాపాడతానని చెప్పాడు.

భల్లూకమాంత్రికుడు అంత తక్కువవాడా! కాపలాలన్నీ ఉంటాయని అతనికి తెలియదా! తనకు తెలిసిన మంత్రవిద్యతో అతను రాజుగారి గుర్రాలలో బలిష్టమైన గుర్రాన్నొకదానిని ఎంచుకుని దానిలో ప్రవేశించి మిగిలిన గుర్రాలతో పాటుగా వాటితో కలిసిపోయాడు. ఆరాత్రి బాగాచీకటి పడినాక ఎవరూ లేనిసమయం చూసుకుని రాకుమార్తె అంతఃపురానికి చేరుకుని ఆమెను అపహరించాలనుకుని సమయంకోసం ఎదురుచూస్తూ ఉన్నాడు.

అర్ధరాత్రి దాటింది. భల్లూకమాంత్రికుడు గుర్రంరూపంలోనే రాకుమార్తె అంతఃపురానికి బయలుదేరాడు. ఈలోగా రాజుగారితో కాపలాకాస్తానని చెప్పిన రాకుమారుడు అటుగా వచ్చాడు. రాకుమారుకు మంచి బలిష్టుడు. అతనికి అశ్వారోహణం, గుర్రపుస్వారీ అంటే ఎంతో ఇష్టం. అందువల్ల గుర్రం రూపంలోని భల్లూకమాంత్రికుడిని చూసి నిజమైన బలిష్టమైన గుర్రమే అనుకుని ఒక్కమారుగా ఎగిరి దానిపైకిదూకాడు.

ఏమాత్రం ఇలా జరుగుతుందని ఊహించని భల్లూకమాంత్రికుడు తనపైన ఉన్న బరువైన యువకుని క్రిందకు తోసేద్దామని ప్రయత్నించాడు. కానీ అది సాధ్యం కాలేదు. పైగా అతని చేతిలో ఉన్న కొరడా గుర్రం వీపుపై చెళ్ళున మ్రోగింది. భల్లూకమాంత్రికుడికి కళ్ళుపచ్చబడ్డాయి. దెబ్బలబాధకు ఓర్చుకోలేక పరుగు లంకించుకున్నాడు.



యువకుడు వేగంగా పరుగెడుతున్న ఆ గుర్రంపైనుండి పడకుండా దాని జూలుపట్టుకుని అది ఆగకుండా పరుగెడుతున్నందుకు కాళ్ళతో డొక్కలోతన్నాడు. భల్లూకమాంత్రికునికి ఆక్షణంలో మంత్రాలు ఏమాత్రం గుర్తుకురాలేదు. ప్రాణభయంకొద్దీ, యువకుని క్రిందకు పడెయ్యాలని మరింతవేగంగా పరుగుతీస్తున్నాడు.

కొండల్లో, రాళ్ళలో, చెట్లల్లో పరుగెట్టడంవల్ల గుర్రం రూపంలో ఉన్న భల్లూకమాంత్రికుని పాదాలు రక్తసిక్తమయ్యాయి. పాదాలలో ముళ్ళు గుచ్చుకున్నాయి. అవేవీ తీసుకునే వీలులేదు. ఇంకా ఇంకా వేగంగా పరుగెడితే తన్నడం ఆపుతాడేమోనని మరింత వేగంగా పరుగుతీస్తున్నాడు. గుర్రంపైనున్న యువకుడికి మాత్రం గుర్రం తన మాట వినకుండా అంతవేగంగా పరుగు తీయడంతో మరింతకోపం వచ్చింది. ఒకచేత్తో గుర్రం జూలు పట్టుకుని మరొక చేత్తో కొరడాతో రెండు దెబ్బలు వేశాడు. భల్లూకమాంత్రికుడికి తనశరీరాన్ని కత్తితో కోసినంత బాధకలిగింది. అలా వేగంగా పోతుండగానే యువకునికి ఇక ఈ గుర్రాన్ని ఆపడం నావల్ల కాదు అనుకుని దగ్గరగా ఒక చెట్టుకొమ్మ వస్తుంటే ఎగిరి దాన్ని అందుకున్నాడు. గుర్రం మాత్రం వేగాన్ని అదుపుచేసుకోలేక నోటివెంట వస్తున్న నురగతో అలా పరుగుతీస్తూనే వుంది.

అయితే ఆమార్గం ప్రమాదకరమైనది. కొండలు, గుట్టలు, లోయలు ఉన్నాయి. సరిగ్గా గుర్రం వేళ్ళే మార్గంలో ముందు పెద్దలోయ ఉంది. గుర్రంరూపంలోని భల్లూకమాంత్రికుడు గుర్రాన్ని అదుపులో వుంచుకోలేక అలా పరుగెడుతూ చివరకు లోయలో పడిపోయాడు. ఆనాటినుండి భల్లూకమాంత్రికుని పీడ విరగడయ్యింది. విషయం తెలుసుకున్న మహారాజు భల్లూకమాంత్రికుడిని అంతంచేసిన యువకునికి రాకుమార్తెనిచ్చి పెళ్ళిచేసాడు.

# అదృష్టం

సౌభద్ర రాజ్యాన్ని గౌరవుడనే రాజు పరిపాలించేవాడు. ఆయన ఆ చుట్టుప్రక్కల రాజ్యాలన్నింటిలోకి శక్తివంతుడు. గౌరవ మహారాజుకు చాలాకాలం వరకు సంతానం కలగలేదు. ఎన్నోపూజలు, వ్రతాలుచేసిన తరువాత వారికి ఒక ఆడశిశువు జన్మించింది. ఆమెను అల్లారుముద్దుగా పెంచుకోసాగారు. గౌరవ మహారాజు గొప్ప పరిపాలనాదక్షుడు. ప్రజలను కన్నబిడ్డలలాగా ప్రేమించేవాడు. లేకలేక కలిగిన శిశువుకు సుమతి అని పేరు పెట్టాడు.

సుమతికి ఐదుసంవత్సరాలు గడిచిన తరువాత వంటిపైన పులిపిరులు లేచాయి. అవి ఎంతకూ తగ్గకపోగా వరసపెట్టి, ముఖం, కాళ్ళు, చేతులకుకూడా వచ్చాయి. సుమతి అందవిహీనంగా కనబడుతోంది. మహారాజు ఆస్థానవైద్యులను పిలిపించి చికిత్స చేయించాడు. అయినాసరే ఫలితం ఏమాత్రం కనిపించలేదు. అంతేగాక మరికొన్ని వచ్చాయి. మహారాజుకు దిగులు కలిగింది. దేశదేశాలలో చాటించాడు. తన కుమార్తెకు వచ్చిన జబ్బు తగ్గించిన వారికి వెయ్యి బంగారు నాణేలు బహూకరిస్తానని ప్రకటించాడు. ఎన్నో దేశాలనుండి ఎందరో ఘనవైద్యులు వచ్చి ప్రయత్నించి విఫలులయ్యారు. అలా కాలం గడున్నా చివరికి సుమతి యుక్తవయస్కురాలైంది.

ఇప్పుడు ఆమెకు పెళ్ళి చేయడం కూడా సమస్య అయికూర్చుంది. ఆస్థానజ్యోతిష్యులు మహారాజుతో "మహారాజా ఏమీ అనుకోవద్దు. మన రాకుమార్తె ఈవిధంగా రాజ్యంలో ఉండడం రాజ్యానికే అరిష్టం! ఇది మామాటకాదు. శాస్త్రాలు అలా ఘోషిస్తున్నాయి. వీలైనంత తొందరగా మన రాకుమార్తెకు పెళ్ళి చేసి రాజ్యంనుండి దూరంగా పంపించండి" అన్నాడు.



జ్యోతిష్కులు చెప్పిన మాటలు మహారాజును మరింత కలవరపెట్టాయి. కుమార్తెకు పెళ్ళిచేసి అల్లుని ఇల్లరికం తెచ్చుకోవాలని ఆయన ఆశ. అయితే ఏదైనా భగవంతునిదే భారం అంటూ పెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. అయినా-అందవిహీనంగా ఉన్న వ్యక్తిని పెళ్ళాడడానికి ఎవరు ముందుకువస్తారు? వివిధ దేశాల రాకుమారులు ఆమె చిత్రపటాన్ని-ఆమెకొరకు చేసినప్రతిపాదనలు తిరస్కరించారు. మరికొందరు ఆ విధంగా పెళ్ళిచేసుకోమని అనాకారిని చూపించడం తమను అవమానించినట్లుగా భావించారు. చివరికి ఏఒక్కరూ ముందుకు రాకపోయేసరికి మహారాజు దిగులు మరింత ఎక్కువ అయింది.

ఒకప్రక్క ఆస్థానజ్యోతిష్కులు రాకుమార్తె పెళ్ళివిషయం, రాజ్యబహిష్కరణ విషయం గౌరవ మహారాజువద్ద ప్రస్తావించి వత్తిడి తీసుకువస్తున్నారు. చివరికి మహారాజు ఒక నిర్ణయానికి వచ్చి "ఎవరైతే నాకుమార్తెను పెళ్ళిచేసుకుని దేశాంతరం వెళతారో వారికి పదివేల బంగారు నాణేలు ఇస్తాను" అన్నాడు.

అయినాసరే! చూస్తూచూస్తూ అందవికారిని ఎవరుపెళ్ళి చేసుకుంటారు? రాజు నిరాశపడుతుండేవాడు. కొన్నిరోజులు గడిచిపోయాక ఒకనాడు ఒకగుడ్డిబిక్షగాడు మహారాజును కలిసి తాను రాకుమార్తెను పెళ్ళి చేసుకోగోరుతున్నానని తెలియజేయాలనుకున్నాడు రాజభటులు అతనిని లోనికి వెళ్ళనివ్వలేదు. అప్పుడు రాజభటులకు అతనికి వాగ్వివాదం జరిగింది. ఈ గొడవ ఏమిటో చూద్దామని మహారాజు అక్కడకు వచ్చాడు. అప్పుడు మహారాజుకు నమస్కరించి గుడ్డివాడు "మహారాజా! నేను తమ కుమార్తెను పెళ్ళి చేసుకునేందుకు -తరువాత దేశాంతరం తీసుకెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాను" అన్నాడు.

మహరాజు "నీపేరేమిటి? నీవు యువకుడివేగానీ గుడ్డివాడివిగదా! మరి రాకుమారిని ఎలాచూసుకోగలవు? నీ అవసరాలు నువ్వు చూసుకోవడానికి

కూడా కష్టమే కదా?" అన్నాడు.


"మహారాజా! నాపేరు విశ్వాక్షుడు. నేను గుడ్డివాడిని అయినా నాకొక మిత్రుడు ఉన్నాడు. ప్రస్తుతం అతనే నాకు చేదోడు వాదోడు. నేను భిక్షమెత్తుకుని తీసుకువచ్చిన దానిని ఇద్దరమూ సమానంగా తీసుకుంటాము. అతను కుంటివాడు, గూనివాడు" అన్నాడు విశ్వాక్షుడు.

మహారాజుకు చూస్తూ చూస్తూ ఒక గుడ్డి భిక్షగాడికి తనకుమార్తెనిచ్చి పెళ్ళి చేయడమా? అనిపించింది. కానీ అందవికారి అయిన సుమతిని పెళ్ళి చేసుకునేందుకు ఎవరూ రాలేదాయె! అయినా తప్పని పరిస్థితిలో సుమతినే రాజ్య బహిష్కరణ చేయాలి! - ఈవిధంగా ఆలోచించి చివరికి విశ్వాక్షుడికి రాకుమార్తెనిచ్చి పెళ్ళి చేయడానికి అంగీకరించాడు.

మహారాజు సుమతికి పెళ్ళిచేసి విశ్వాక్షుడికి చెప్పినవిధంగా పదివేల బంగారునాణేలను ఇచ్చి -సుమతికి బహుమానంగా రెండు గుర్రాలను, ఒక ఏనుగును ఇచ్చి పంపించాడు. విశ్వాక్షుడు తనమిత్రుని, సుమతిని తీసుకుని రాజ్యం సరిహద్దులను దాటాడు. అలా వారు కొంతదూరం ప్రయాణించాక ఒకచోట ఒక చిన్న ఊరు తగిలింది. అక్కడ ఒక సత్రం చూసి వచ్చి గూనివాడు వీరిద్దరినీ తీసుకెళ్ళాడు. ఆ సత్రంలో ముగ్గురూ మూడురోజులు ఉన్నారు.

ఈ మూడురోజులలో గూనివాడికి వీరిద్దరివద్ద ఉన్న ధనంపై ఆశకలిగింది. వీళ్ళని అంతంచేస్తే ఆ ధనాన్నంతా తానే అనుభవించవచ్చని ఆలోచన చేయసాగాడు. రాకుమార్తె మాత్రం ఎంతో విచారంగా ఉన్నది. తన భర్త ఒకగుడ్డివాడు, భిక్షగాడు అయినందుకు ఎంతో దుఃఖిస్తూ ఉన్నది. దీనిని గమనించిన గూనివాడు రాకుమార్తె దగ్గర చేరి తీయని మాటలు చెపుతూ-"ఎలాగైనా సరే నువ్వు రాకుమార్తెవై ఉండి గుడ్డివాడిని పెళ్ళిచేసుకోవడం నాకే నచ్చలేదు. నీకు ఇష్టమైతే మనిద్దరం





పెళ్ళిచేసుకుందాం-ఈ గుడ్డివాడిని ఎలాగైనా చంపేద్దాం" అన్నాడు.

దానికి రాకుమారి ఆలోచించి తన అంగీకారాన్ని తెలిపింది. ఇద్దరూ కలిసి గుడ్డివాడికి విషమిచ్చి చంపాలని నిర్ణయించారు. అంతేగాక వారు ఆ పథకాన్ని అమలుచేసేందుకు సిద్ధమయ్యారు కూడా! గూనివాడు బజారుకువెళ్ళి మంచిగాఢమైన పాము విషం కొనుక్కుని వచ్చాడు. దానిని రాజకుమార్తెకు ఇచ్చాడు.

ఈ పాము విషాన్ని కూరలోకలిపి భోజనాలు చేసేటప్పుడు దానిని కేవలం గుడ్డివాడికి వడ్డించాలని నిర్ణయించారు. ఈలోగా గుడ్డివాడు అక్కడకు వచ్చాడు. పొయ్యిపైన కూర ఉన్నది. రాకుమార్తె దానిలో పాము విషాన్ని కలిపి చెక్కగరిటతో తిప్పుతున్నది.

గుడ్డి వాడు పొయ్యికి కాస్త దగ్గరగానే కూర్చున్నాడు. పొయ్యిపైన ఉన్న కూర ఉడుకుతుంది. దానినుండి పొగలు వస్తున్నాయి. ఇంతలో ఆశ్చర్యం కలిగేసంఘటన జరిగింది. పొయ్యిలో నుండి వస్తున్న పొగలు దానికి దగ్గరగా ఉన్న గుడ్డివాడి కళ్ళకు తగిలాయి. ఆశ్చర్యపోయేలాగా-గుడ్డివాడికి చూపు క్రమక్రమంగా వచ్చింది. గుడ్డివాడు తాను లోకాన్నంతా చూడగలుగుతున్నాడు. ఇప్పుడు నిజంగానే విశ్వాక్షుడయ్యాడు!

విశ్వాక్షుడు పొయ్యిపై ఉన్న కూరను చూశాడు అది విషమని గ్రహించడానికి అతనికి ఎంతోకాలం పట్టలేదు. అతనికి చూపువచ్చినట్లే సుమతికి పులిపిరులు రాలిపోయాయి. ఆమె ఇప్పుడు అద్భుత సౌందర్యవతిగా మారింది. అప్పుడే బయటకు వెళ్ళివచ్చి వీరిద్దరినీ చూసి నోరు వెళ్ళబెట్టిన గూనివాని నోటిలోనికి గురిచూసి కొంచెం కూరను విసిరాడు విశ్వాక్షుడు. మహాకాలకూటవిషంఅది! తక్షణం గూనివాడు క్రిందపడి గిలగిలా కొట్టుకుని మరణించాడు. రాకుమార్తె విశ్వాక్షుడిని మన్నించమని వేడుకొన్నది. ఆమె వలన గదా తనకు చూపువచ్చింది అని భావించి క్షమించాడు. ఇరువురూ





హాయిగా మరలా తమరాజ్యానికి పోయి గౌరునికి సంతోషాన్ని కలిగించారు. గౌరవుని తదనంతరం విశ్వాక్షుడు రాజుగా ప్రజానురంజకంగా పరిపాలించాడు.

## దైవదత్తం

వత్సలదేశానికి కుశోవంతుడు రాజుగా పరిపాలిస్తున్నాడు. కుశోవంతునికి ఒకేఒక కుమారుడు ఉన్నాడు. అతనిపేరు కర్ణప్రియుడు. కర్ణప్రియుడు అందగాడు మంచి తెలివితేటలు గలవాడు. అయితే రోజులన్నీ ఒక్కలాగా ఉండవుకదా! రాకుమారుడు ఒకనాడు ఉద్యానవనంలో విహరిస్తుంటే ఒక దుష్టపాము అతనిని కరిచింది. దాని విషప్రభావంవల్ల రాజకుమారుని శరీరం అంతా నల్లగా మారిపోసాగింది. కొన్నిరోజులకు రాజకుమారుని శరీరం పూర్తిగా నల్లగా మారిపోయింది. పైగా అతని చర్మం పొరలుపొరలుగా ఊడిపోతూకూడా ఉండేది. దీనితో రాకుమారుడు చూడడానికే అసహ్యంగా తయారయ్యాడు.

ఆనాటినుండి రాకుమారుడు ఎవరితోనూ మాట్లాడడు నిస్తేజంగా ఒంటరిగా ఉండేవాడు. ఒకనాడు ఉన్నట్లుండి రాకుమారుడు కనిపించకుండా పోయాడు. మహారాజు కుశోవంతుడు మంత్రులు, ఇతర రాజోద్యోగులను పిలిపించి కర్ణప్రియుడుని వెతికించాడు. కర్ణప్రియుడు ఎక్కడా కనిపించలేదు. కొందరు భటులను ఇతరదేశాలకు కూడా వెళ్ళి కర్ణప్రియుడ్ని వెతకమని పంపాడు.

కొంతకాలం గడిచాక కుశోవంతునికి రాకుమారుడిజాడ తెలిసింది. మంత్రులను కొందరిని రాకుమారుని వద్దకుపంపి రాకుమారుని తిరిగి రాజ్యానికి రమ్మని కోరాడు. కర్ణప్రియుడు సన్యాసివేషంలో ఉన్నాడు.

చూడడానికి భిక్షగాడిలాగా చేతిలో ఒక భిక్షాపాత్రతో చుట్టుప్రక్కలవారు ఏదైనాపెడితే తింటూ ఒక గుడిలో దైవపూజలు చేసుకుంటూ ఉన్నాడు. తాను తిరిగి వత్సలదేశానికి రానని తనను బలవంతపెట్టవద్దని తనకు ఇక్కడే మనసు ప్రశాంతంగా ఉన్నదని చెప్పాడు. కర్ణప్రియుడు ఉన్నది వత్సలదేశపు పొరుగు రాజ్యమైన మాళవదేశంలో. ఇక రాజకుమారుడు ఆవిధంగా చెప్పేసరికి ఏంచెయ్యాలో తోచక వట్టి చేతులతో వెనుదిరిగారు తీసుకువెళ్ళడానికి వచ్చిన మంత్రులు, ఇతర రాజోద్యోగులూను.

భగవంతునిపైన భారం వేసి రోజులు నెట్టుకొస్తున్నాడు కుశోవంతుడు. ఇక అక్కడ మాళవదేశంలో రాజకుమారుడు నివసిస్తున్న గుడికి ప్రతికార్తీక సోమవారంనాడు రాజకుటుంబీకులు వచ్చి పూజలు నిర్వహించడం ఆనవాయితీ. కార్తీకమాసం ప్రవేశించింది. సోమవారం కూడా రానేవచ్చింది. మాళవదేశపు మహారాజు మాధవవర్మకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకుమార్తె చారుమతి, రెండోకుమార్తె పేరు కళావతి. చారుమతికి భౌతిక సుఖాలపై ఆశ ఎక్కువ. ధన, కనక వస్తు, వాహనాలు ఎల్లప్పుడూ ఉండాలని భావిస్తూ ఉంటుంది. కళావతి ఈమెకు పూర్తిగా విరుద్ధంగా ఉంటుంది. సాధుస్వభావి.

భగవంతుడు మనకు కావలిసింది తానే ఇస్తాడు. కష్టాలైనా నష్టాలైనాసరే అదేవిధంగా సుఖదుఃఖాలైనా అన్నీ ఆయన ఇష్టానుసారమే జరుగుతాయి. రెండింటినీ సమానంగా అదే మన అదృష్టంగా భావించాలని ఆమె ఉద్దేశ్యం.

ఇరువురు కుమార్తెలతో పాటుగా మాధవవర్మకూడా గుడికి వచ్చాడు. యధావిధిని పూజులు, అభిషేకాలు జరిపించిన తరువాత దేవుణ్ణి ప్రార్ధిస్తూ పెద్దకుమార్తె చారుమతి "దేవా! మాకు కావలిసినవన్నీ మానాన్నగారు! మహారాజు మాధవవర్మ గారు ఇస్తున్నారు. ఆయన్ని చల్లగాచూడు" అని పలికింది.





కళావతి "దేవా! మనం చేసుకున్న పుణ్యపాపాల ఫలితంగానే మనకు దక్కేదే దక్కుతుంది. కానీ రాకూడనిది మనకు రాదు! అందుచేత మాకు నువ్వు ఏదిప్రసాదించినా అంతా మనమంచికే అని భావిస్తూ ప్రార్థిస్తున్నాను" అన్నది.

ఇరువురుకుమార్తెల ప్రార్థనలను విన్న మాధవవర్మకు చారుమతిపైన అభిమానం ఎక్కువైంది. కళావతి ప్రార్థన ఆగ్రహాన్ని కలిగించింది. మహారాజు కళావతితో "దేవుడు ఏది ఇచ్చినా తీసుకుంటావా?" అన్నాడు. "దైవాజ్ఞ లేనిదే ఏదీజరగదు కదా నాన్నగారూ!" అన్నది కళావతి.

మహారాజుకు మరింత ఆగ్రహం కలిగింది. "అయితే ఆ కనిపించే భిక్షగాడిని తీసుకువచ్చి పెళ్ళిచేస్తాను! అదిగూడా దైవాజ్ఞ అని సరిపెట్టుకో" అన్నాడు కోపంగా.

"అదే దైవాజ్ఞ అయితే అదే ప్రసాదంగా స్వీకరిస్తాను" అన్నది శాంతంగా కళావతి. మాధవవర్మ చూపించింది కర్ణప్రియుడినే.రాజు ఆగ్రహానికి గురయిన కళావతికి చివరకు కర్ణప్రియుడిని పెళ్ళాడక తప్పలేదు.

అందవిహీనుడైన కర్ణప్రియుడిని పెళ్ళాడాక ఇంకా అక్కడే ఆరాజ్యంలోనే ఉండాలని అనిపించలేదు. అంతా దైవానుగ్రహం అని భావించి అక్కడనుండి బయలుదేరి అడవికి వెళ్ళారు. అడవిలో చిన్న కుటీరాన్ని ఏర్పాటుచేసుకుని కట్టెలు కొట్టి వాటిని చుట్టుపక్కల గ్రామాలలో అమ్మి దానితోనే జీవనం సాగిస్తున్నారు. భర్త ఉదయాన్నే కట్టెలుకొట్టడానికి బయలుదేరి వెడితే కళావతి కాసేపు ఆగి భోజనం మూటకట్టుకుని భర్తని వెదుకుతూ బయలుదేరేది. ప్రశాంతమైన జీవనంలో వాళ్ళు సుఖంగా ఉంటున్నారు.

ఒకనాడు ఉదయం ఎప్పటిలాగా కర్ణప్రియుడు భుజానగొడ్డలి ధరించి అడవిలోకి వెళ్ళాడు. ఆరోజు కర్ణప్రియుడు అడవిలో చాలాదూరం వెళ్ళాడు.

కళావతి భోజనం మూటగట్టుకుని అడవిలో వెతుకుతూ బయలు దేరింది. ఎంత సేపు వెతికినా కర్ణప్రియుని జాడదొరకలేదు. మధ్యాహ్నవేళ మించిపోతుంది. చివరికి ఒకచోట చెట్టునీడలో కర్ణప్రియుడు పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. కర్ణప్రియుడు ఊపిరి వదులుతున్నప్పుడు అతని నాసికలనుండి నీలిరంగు పొగలువస్తున్నాయి. ఆ పొగలకు ఆకర్షితురాలైన ఒక నల్లత్రాచు అటువైపుగా వచ్చింది. నిద్రిస్తున్న కర్ణప్రియుని వద్దకు చేరి బుసలు కొట్టసాగింది. అంతేగాక అతని నాసికలనుండి వస్తున్న పొగలను ఆనందంతో పీల్చడం మొదలుపెట్టింది.

కళావతి దీని అంతా ఒక చెట్టుచాటునుండి గమనిస్తూ ఉంది. ఇంతలో కర్ణప్రియుడు నిద్రిస్తున్న చెట్టుక్రింద ఉన్న ఒక బొరియలోనుండి మరొకపాము వచ్చి "నీకేమైనా బుద్ధి ఉందా? నిద్రపోతున్న రాకుమారుడికి నిద్రాభంగం కలిగించవచ్చా?" అని అడిగింది.

"అది నీకెందుకు నాకంటే నువ్వు గొప్పదానివా?" అన్నది నల్లత్రాచు. "నీదగ్గర ఏముంది? వట్టి విషం తప్ప! నావద్ద అనేక మణులు, మాణిక్యాలు, రత్నాలు, బంగారం ఎంతో ఉన్నాయి. ఆ ధనంతో రెండు మూడు రాణులనే కొనవచ్చు" అన్నది రెండవ పాము.

దానికి నల్లత్రాచు "నాదగ్గర ధనం లేదు కానీ నేను విషజంతువును అయినా నా విషం సంగతి అటుంచి రాకుమారుడిని ఆరోగ్యవంతుడిని చేయగలశక్తి నాశరీరానికి ఉంది. నాశరీరాన్ని రాకుమారుడి శరీరంతో రాపాడిస్తే అతను ఆరోగ్యవంతుడవుతాడు తెలుసా?" అన్నది.

కళావతి ఈమాటలను జాగ్రత్తగా విని- అడవిలో తనరక్షణ కొరకు తెచ్చుకున్న కత్తితో రెండుపాములన్నూ ఒక్కదెబ్బతో సంహరించింది. ఇదంతా భగవంతుడే తనకు ఇచ్చిన అనుగ్రహ ఫలితమేనని భావించి నల్లత్రాచు





శరీరాన్ని రాకుమారిని శరీరంపై నుంచి రుద్దింది. ఆశ్చర్యపోయేవిధంగా రాకుమారుని శరీరంనుండి నీలిరంగు పొగలు బయటకు వచ్చాయి. కర్ణప్రియడు మునుపటికంటే కాంతివంతంగా మెరుస్తూ కనబడ్డాడు. అతని వికృత రూపం పోయింది. కర్ణప్రియుడు లేచిన తరువాత జరిగిన విషయంచెప్పింది. ఇద్దరూ ఎంతో సంతోషించారు. రెండవపాము బొరియను త్రవ్వగా వారికి అపారమైన నిధి కనిపించింది. ఇరువురూ దొరికిన నిధిని తీసుకుని మాళవదేశానికి వెళ్ళారు. మాధవవర్మ వీరిరువురనూ చూసి తన తప్పు తెలుసుకున్నాడు. అల్లుని క్షమాపణలు కోరాడు. ఈలోగా వేగులద్వారా కర్ణప్రియుని వృత్తాంతం తెలుసుకున్న కుశోవంతుడు కూడా అక్కడకు చేరుకున్నాడు కర్ణప్రియుడు తండ్రిని ఆలింగనం చేసుకున్నాడు ఆనందంతో- తరువాత భార్య కళావతితో, తండ్రి వెంట వత్సలదేశానికి వెళ్ళి తండ్రి తదనంతరం సుస్థిరమైన పరిపాలన సాగించాడు కర్ణప్రియుడు.